Regd No. M. 760.

# AKASAVANI.

## A MONTHLY MAGAZINE.

EDITORS

**A. BAPIRAZU.**

AND

**S. SATYANARAVANA MURTY.**

*Vol. I.* **SEPTEMBER** *No. 1.*

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి."

విషయసూచిక

1. గవర్న్మెంటు జిరాయితీలు & రివిజన్
2. నూతనజీవితము.
3. కవిత.
4. చంద్రసేనవిజయము. (చిన్ని కథ)
5. రాజపుత్రవిజయము. (నాటకము)
6. మయూరసింహాసనము. (నవల)
7. ద్రౌపది. (పతివ్రతాచరిత్ర)
8. న్యాయవాదివిలాసము. (ప్రహసనము)

VIRASALINGAM ... RAJAHMUNDRY ... LIBRARY

59

*T. Bapirazu*
PROPRIETOR

PRINTED & PUBLISHED BY

*V. N. Press*
RAJAHMUNDRY

| | |
|---|---|
| చందా సంవత్సరమునకు | రు 2—8—0. |
| సహాయులకు | 5—0—0 |
| పోషకులకు | 10—0—0. |

రాజపోషకులకు వారి యనుగ్రహాధీనము.

ప్రకటనలకు రేట్లు తెలియగోరువారు దీనికి చందాదారులుగ నుండగోరువారు మాకు వ్రాయవలయును.

పత్రికాధిపతులు

ఆకాశవాణి, రాజమండ్రి.

# ఆకాశవాణి.

పత్రికాధిపతులు. { అయ్యగారి బాపిరాజు. సూరంపూడి సత్యనారాయణమూర్తి.

Vol. 1. { సెప్టెంబరు. 1912. సంవత్సరము. } No. 1.

## గవర్నమెంటుజిరాయితీలు, రిమిషను.

[*సర్కారుజిరాయితీపల్లపుభూములపైని శిస్తు రిమిషనువిషయమై గవర్నరుగారిశాసననిర్మాణసభలో జరిగినచర్యయొక్క సారాంశము.]

గవర్నమెంటుజిరాయితీపల్లపుభూములయందలి పంటలు పదియారు అణాలలో $5\frac{1}{3}$ అణాలు(పూరాపంటలో 3వవంతు)కంటె తగ్గిపోయినప్పుడు శిస్తును ముజరా యివ్వవలయునను నొక నిబంధన నేర్పరుపవలయునని బరంపురంవాస్తవ్యులును శాసననిర్మాణసభాసభ్యులును గౌరవనీయులు నగు శ్రీగాది రాఘవరావుపంతులుగా రొకతీర్మానమును 1912 సం॥ మెయినెలలో గవర్నరుగారిసభలో నుపాదించుచు నిట్లుచెప్పిరి.

"పొలముగయాళుగా విడిచిపెట్టబడినప్పుడుగాని, పంట పూర్తిగా నష్టమైనప్పుడుగాని రిమిషనుదయచేయబడవలయుననియు, పంటపూర్తిగానష్టమైనదో లేదో నిర్ధారణచేయు

---

* ఇది శాసననిర్మాణసభలో జరిగిన సర్వాంశమైన రాజకీయసంబంధమగు విషయము గాన పాఠకులిందలి వ్యాకరణదోషములను అన్యపదోపయోగములను మన్నించెదరుగాక.

విషయము,ఆ సంబంధమయిన విధులనుబట్టి నిశ్చయించుటకు కలెక్టరులకు విడిచిపెట్టబడినదనియు, రిమిషనిచ్చుట దొరతనమువారి దయతోఁగూడినపనియనియు, ఆవిషయమైన నిబంధనలను వారియిష్టమునననుసరించిదొరతనమువారు అప్పుడప్పుడు మార్పుచేయవచ్చుననియు, రివిన్యూబోర్డువారి స్టాండింగుఆర్డరులలో విధింపబడియున్నది. ఈసందర్భమున చెప్పదలచినవి మూఁడుసంగతులు. పంటపూర్తిగానష్టమైనప్పుడు రిమిషనిచ్చుట దొరతనమువారి దయతోగూడినపనికాదనియు సెటల్మెంటు పద్ధతులనుబట్టియును ఆయాకాలములలో అప్పటియధికారులేర్పరుచుకచ్చిన నిబంధనలనుబట్టియును రయితులు పూర్వకాలమునుండియును అట్టిరిమిషనునుపుచ్చుకొనుటకు అనివార్యమైనహక్కును కలిగియున్నారనియును దొరతనమువారికి నచ్చచెప్పుట మొదటిది. పంటపూర్తిగానష్టమైనదోలేదో నిర్ధారణచేయునధికారము కలెక్టరుకు విడిచిపెట్టకుండ ఎంతపంటపండినచో పూర్తిగాపంట నష్టమైనట్లెంచబడవలయునో నిర్ణయింపవలసినయావశ్యకమున్నదని దొరతనమువారికి చూపుట రెండవది. పదియాఱుఅణాలలో $5\frac{1}{3}$ అణాలపంట వ్యవసాయపుఖర్చులక్రింద సరిపోవును కాబట్టి $5\frac{1}{3}$ అణాలుపంట పండినప్పుడు పంటపూరా నష్టమైనట్లు పరిగణించుట కంగీకారము నొసంగుడని దొరతనమువారిని కోరుట మూడవది.

మొదటిది:—పూర్వపుహిందూరాజులును, మహమ్మదీయపరిపాలకులలో చాలమందియును పన్నును రొక్కరూపకముగ గాకుండ పంటరూపకముగ పుచ్చుకొనుచుండెడివారు. అందుచే ఎంతపంటపండిన నందులోభాగమే పన్నుక్రిందపోయెడిది. మహమ్మదీయపరిపాలనములో ఆఖరుభాగమునను, బ్రిటిషుపాలనములో మొదటిభాగమునను పన్నును రొక్కరూపకముగ పుచ్చుకొనుచువచ్చిరి. ఆకాలమున పంటనష్టమైనప్పుడు శిస్తును రిమిషను యిచ్చుచుండెడివారు. గవర్నమెంటుజిరాయితీభూములకు రయితువారీ పద్ధతి 1817 సంవత్సరములో ఆరంభమయినది. అప్పటిసెటల్మెంటురూల్సులో కాలవ్యత్యయమునుబట్టి పంటపూరాగాగాని కొంతభాగముగాని నష్టమైనప్పుడు శిస్తులను ముజరా యివ్వబడునను నియమమున్నది. కొంతభాగము నష్టమైనప్పుడుకూడ ముజరాయిచ్చుటచే రొక్కరూపకముగ పుచ్చుకొనుచున్నను అదిపండినపంటలో భాగమేయని తేలుచున్నది. మరియు 1900 వ సంవత్సరములో బోర్డువారితీర్మానములోకూడ మదరాసురాజధానిలోని పల్లపుభూములపై శిస్తు పంటలోభాగమైయున్నది అనిచెప్పబడియున్నది. పండినపంటలో కొంతభాగము పన్నుఅని చెప్పబడినప్పుడు పంటనష్టమైనచో

రిమిషను పుచ్చుకొనుటకు రైతునకు హక్కు కలిగియున్నట్లు స్పష్టమగుచున్నది. 1855 వ సం॥ర ప్రాంతమున భూమిసర్వేచేసి తరమేర్పరచి శిస్తుకట్టుటకు నిశ్చయింపబడి క్రొత్త సెటల్ మెంటు నిబంధనలేర్పడినవి. పంటలు కొంతభాగమునష్టమైనప్పుడు శిస్తు [illegible] లిచ్చుపద్ధతి మానివేయుటకై పండుపంటలో కొంతభాగము అందుక్రింద మినహాయించి మిగతాదానిపై శిస్తుకట్టునియమము అప్పుడేర్పరుపబడినది. అయినను అప్పుడు [illegible] పూర్తిగా పోయినప్పుడు కలుగునష్టము లెక్కచూడలేదు. గట్లు, బోదెలు, [illegible] మొదలగు పంటలుపండుటకక్కరకురాని భాగములకై మినహాయింపబడినది. [illegible] గూడ పంటపూర్తిగానష్టమైనప్పుడు రిమిషనుహక్కుగహించునకు తీర్పు [illegible] 1902 సంవత్సరములో చేయబడిన గవర్నరుజనరల్ గారితీర్మానముయొక్క [illegible] వ్రాయబడినసంగతులనుబట్టికూడ యీవిషయముఅంగీకరింపబడియున్నట్లు స్పష్టమగుచున్నది. పంజాబులో కొంతభాగము పంటనష్టమైనప్పుడుకూడ రిమిషనుపొందెడిహక్కు [illegible] డును కలిగియున్నది. కాబట్టి రయితునకు పంటనష్టమైనప్పుడు రిమిషనుపొం[illegible] వార్యమైనహక్కు కలదు.

రెండవది, మూడవది } రిమిషనిచ్చుట దొరతనమువారి దయతోగూడినపనియని [illegible], [illegible] చెప్పదగినదియే లేదు. "పుణ్యమునకు పుట్టెడిచ్చిన పిచ్చకుంచ [illegible] డినట్లు" అనుసామెత దీనికన్వయింపవచ్చును. కలెక్టరకును, సబుకలెక్ట[illegible] టీకలెక్టరకును అధికారమిచ్చినందులకు దొరతనమువారిని నిందింపపనిలేదు. కా[illegible] పొందుటకు రయితుకు అనివార్యమైనహక్కు కలదని యంగీకరించినపక్షము[illegible] గానష్టముయినదాలేదాయనినిర్ధారణచేయవలసినపూచీదొరతనమువారి[illegible] నిర్ధారణచేయుటమాత్రము చాలకష్టము. అరణా, అణా, రెండణాలు, [illegible] పండవచ్చును. ఎంతపంటపండిన పూర్తినష్టమయినట్లెంచబడవలయు[illegible] వను యివ్వవచ్చునో రాదో నిర్ధారణచేయ నవకాశముండదు. [illegible] పూర్తినష్టమయినట్లెంచవలయునో నిర్ణయించుట [illegible] యున్నది.

ఖర్చులుపోను మిగిలిన నికరాదాయములో [illegible] సెటల్ మెంటునిబంధనలు చెప్పుచున్నవి. వ్యవసాయముచే[illegible] రానప్పుడు దొరతనమువారికి పన్ను చెల్లించుట చాలకష్టము. పంటలు [illegible]

సంవత్సరములో నైనను రయితుతనకుటుంబమును పోషించుకొనగలుగునంతటిలాభ మే మిగులుచున్నదిగాని పూరానష్టముయినసంవత్సరములో దొరతనమువారికి పన్నునిచ్చుకొనుటకును తనకుటుంబమును పోషించుటకును ద్రవ్యమును గూడబెట్టుకొనుటకు వలసినంత లాభము చేకురుటలేదు. కాబట్టి దొరతనమువారు బీదరయితులయెడ అనుగ్రహముంచి వ్యవసాయమునకు ఖర్చులకు సరిపడునంతమాత్రపు పంటయే పండి దానివలన నికరాదాయ మేమియు నుండనప్పుడు శిస్తు రిమిషనీయవలయునను వరమును ప్రసాదింపవలసియున్నది. ఖర్చులకు $5\frac{1}{3}$ అణాలుపంట సరిపోవునని నాయభిప్రాయము."

దొరతనమువారిపక్షమున గౌరవనీయులగు అట్కిన్సను దొరగారీతీర్మాన మునంగీకరింపరాదని చెప్పుచు యిట్టుల సమాధాన మొసంగిరి.

"రాఘవరావుపంతులుగారెన్నియో విషయములను చెప్పియున్నారు వానికన్నిటికిని ప్రత్యేకముగ సమాధానమీయ నవకాశములేదు. వారుచెప్పిన ముఖ్యవిషయమేమనగా, సెటిల్ మెంటు కాలమున శిస్తుకట్టుటలో దొరతనమువారు రయితులకు దయాపూర్వకముగ తీసివేసిన మొత్తములుగాక ఇకనొకవిధమగు రిమిషను యివ్వవలయునను నియమమేర్పాటు చేయదగినదైయున్నది. శిస్తు నెట్లు యేర్పాటుచేయవలయునో లెక్కలువేసి చూచినప్పుడు హెచ్చుధరలుగల సంవత్సరములును తీసివేసి సమానధరలుగల ఇరువది సంవత్సరముల ధరలు దామాషాయిచేసి, అట్లు తేలిన మొత్తములో వర్తకులలాభమును సరుకులు స్వస్థలముల కంపుటకయ్యెడి ఖర్చులును, వ్యవసాయమునకగు ఖర్చులను [illegible] కాలాన్తర్యాయమునుబట్టి పంటలు బాగుగా పండక పోవుటవలన గలుగు నష్టముకింద కొంతయును తీసివేసి మిగిలినదానిలో సగము రైతు అనుభవించుటకును తక్కినసగమును దొరతనవారికి పన్నుగా నిచ్చుటకును ఏర్పరుపబడినది. దృష్టాంతరముకొరకు యీతీర్మాన [illegible]దారునకు వచ్చిన సభ్యులు నివసించియున్న గంజాముజిల్లాను తీసుకొనెదను. [illegible]జిల్లాలో సర్వసామాన్యమైనపంట (12 అణాలు) యకరమునకు* మద్రాసుకుంచ[illegible] 720 ధాన్యము పండుచున్నదని వ్యవసాయశాఖవారు లెక్కలు వేసియున్నారు. [illegible] లెక్కలు రివెన్యూబోర్డువారును కలెక్టర్లును అంగీకరించియున్నారు. సెటిల్ మెంటు [illegible]లు పంటలు పరీక్షించియును లెక్కవేసియును గంజాంజిల్లా శ్రీకాకుళము [illegible]కును తాలూకాలలో యకరమునకు మద్రాసు పడిని 560 కుంచముల ధాన్యము [illegible]నని లెక్కతేల్చియున్నారు. దీనికిని దానికిని యింత భేదమున్నదేమని సభ్యులాశ్చర్య

* [illegible] కుంచమునకు, మద్రాసుకుంచములు రెండగును.

వడవచ్చును. దీనికికారణము, సెటల్ మెంటు ఉద్యోగస్థులు సాధ్యమైనంతవరకురయితు లకు ఉపకారము చేయవలయునను ఉద్దేశముగలిగియుండుటయే. ఇందువలన ఏవిధము యినపన్నులేకుండ యకరమునకు 160 కుంచములునంతున సర్వసామాన్యమైన పంటలు పండు ప్రతిసంవత్సరమునందును రయితునకు విడిచిపెట్టబడినవి.

సెటల్ మెంటు ఉద్యోగస్థులు అత్యధికపంట (పదహారుఅణాలు) యగు 900 కుంచములుగాని సర్వసామాన్యపంటయగు 720 కుంచములుగాని తీసికొనక 560 కుంచముల మీదనే లెక్కవేసి అందులో ఖర్చులు తీసివేసి మిగిలినదానిపై పన్ను విధించియు న్నారు. చెడ్డసంవత్సరములో పంటలు తగ్గిపోవునేమోయనియెంచి నూటికి 10 వంతున తీసివేసినవి (ఇదియొక శాశ్వతమైన రిమిషను) 56 కుంచములును, వ్యవసాయఖర్చుల కింద తీసివేసినవి 270 కుంచములునుపోగా నికరాదాయముకింద తేలిన 234 కుంచములలో 117 కుంచములు రయితునకును 117 కుంచములు దొరతనమువారికిని పన్నుకిందనుయేర్పరు పబడినది. సర్వసామాన్యపుపంట 720 కుంచములలో 117 కుంచములేపన్నుగా యేర్పడి నది. ఇది రొఖరూపకముగా మార్చుటలోవేసిన లెక్కలుకూడ పరిశీలింతము.

గంజాముజిల్లాలో హెచ్చుధరలు గలిగినసంవత్సరములను తీసివేసి మిగతాసంవత్స రముల ధరలను దామాషాయిచేసి అందు నూటికి 15 వంతున వర్తకుల లాభములను విడిచి పెట్టిచూడగా ధర గరిశె 1కి రు 113 లు తేలినది. హెచ్చుధరల సంవత్సరములు కలిపి చూచిన గరిశెకు రు 124 లగును. హెచ్చుధర గలిగిన సంవత్సరములో యీవిధముగా గూడరైతులకు కొంతలాభము కలుగుచున్నది.

ఈవిధముగా గంజాముజిల్లాలో సర్వసామాన్యపంటగా సెటల్ మెంటుఉద్యోగ స్థులు యేర్పరచిన 560 కుంచములకు పైన వుదహరించిన ధర ప్రకారం అయినమొత్తము రు21-11-2లు ఇందులో పైనచెప్పినతీరున ఖర్చులు రయితు భాగము మొదలగునవి తీసివే యగా దొరతనమువారి శిస్తు రు 4-9-0 అగుచున్నది. అయినను సెటల్ మెంటు పట్టీన నుసరించి దామాషాయిరేటు రు 4-2-0 లో రు 0-2-0 కూడ రయితునకు విడిచిపెట్టి రు4 0-0 లు మాత్రమే శిస్తు యేర్పరచినారు. 720 కుంచములను వరుసగా ఇరువది సంవత్సరముల ధరలునువేసి లెక్కచూచినచో యకరం 1కి దొరతనమువారి శిస్తు రు 7-5-0 లు అగును. అయినను రు3-5-6 లు తీసివేసి రు4-0-0 మాత్రమేశిస్తు యేర్పరచినారు. రయితు నకు నష్టముగాని బీదతనముకాని దొరతనమువారి పన్నువలన వచ్చుటలేదు. లోపాయికారీ

అమరకములవలననే అట్టివి సంభవించుచున్నవి. ఈరాజధానిలో సగభాగము రయితులు లోపాయికారీగ అమరకము చేయుచున్నారు శ్రీకాకుళము బరంపురము తాలూకాలలో ఇంచుమించు 2000 యకరములభూమి అట్లు అమరకము చేయబడినది. అమరకపు శిస్తు మంచిభూములకు యకరమునకు 31 రూపాయిలును బీదభూములకు పదిహేనురూపాయిలును శిస్తు కలదు. సేలము, చెంగల్పట్టు మొదలగుకొన్నిజిల్లాలలో యకరమునకు రు 60, రు 70, రు 100, లు శిస్తు కలదు. సర్వసామాన్యముగా పల్లపుభూములపైని దొరతనమువారిశిస్తుకు అయిదురెట్లు శిస్తునకు అమరకమగుచున్నవి. గౌరవనీయులగు ఈసభ్యులు రిమిషను అమరకము చేసికొను రయితులకుకూడ నీయవలయునని తలంతురా?'' (ఈవిషయమునునింకను నెంతయో చెప్పిరి)గ్రంథవిస్తరభీతిచే విడచితిమి )

పిదప రాఘవరావుపంతులుగారుపపాదించిన తీర్మానమును బలపరుచుచు గౌరవనీయులగు మోచర్ల రామచంద్రరావుపంతులుగారును శేషగిరి అయ్యరుగారును చాలదూరముపన్యశించిరి అట్కిన్సను దొరవారును విశేషముగ తమతమ యభిప్రాయములను వ్యక్తీకరించిన పిదప సభ్యుల యంగీకారమునకై తీర్మానముంప బడియెను. 23 గురు సభ్యులు వ్యతిరేకాభిప్రాయులైరి. 12 గురు అనుకూలాభిప్రాయులైరి. గవర్నరుగారును మఱియిద్దరు సభ్యులు తమ యభిప్రాయములను వెల్లడింపరైరి. తీర్మానముత్రోసివేయబడియెను.

సెటల్మెంటు ఉద్యోగస్తులుకొన్నియెడల పంటలు వ్యవసాయపు ఖర్చులు నికరాదాయము మొదలగునవి లెక్కవేయుటలో రయితులకు కొంత నష్టము గలుగునట్లు లెక్క వేయబడినదనియు, రయితునకు రిమిషను పొందుహక్కు కలదని యంగీకరించుట దొరతనమువారికి న్యాయమనియు, కలెక్టర్ల యిష్టానుసారముగా గాకుండ కొంతవరకు నియమమేర్పరచి యంతకు తక్కువ పండినభూములకు శిస్తు రిమిషను యిప్పింపవలయునను నిబంధన నేర్పరచి బీదరయితుల బాధలు తొలగించుటకూడ పాలకుల కుచితమనియు మాయభిప్రాయము. తీర్మానమిప్పుడు త్రోసివేయబడినను దొరతనమువారీవిషయమున దయార్ద్రహృదయముతో తమక్రింది యుద్యోగస్తులకు రయితులను గాపాడు నాజ్ఞల నొసంగి యాదరింతురను నాశతో నున్నారము ఈతీర్మానమువిషయమున సభలో జరిగిన చర్యసంగ్రహముగ నిందు దెలిపితిమి. వివరముగవ్రాయబూనితిమేని 100 పేజీల గ్రంథమగును.

# మా న వ జీ వి త ము.

గీ. అరయ మనుజునిజన్మ మీ ♦ యవనియందు
సార్థకము నొందు సత్క్రియా ♦ చరణమున నె;
పెద్దకాలంబు మనుటచేఁ ♦ బెంపు లేదు
వాయసము బ్రదుకదె వేయి ♦ వత్సరములు.

గీ. పారమార్థికచింతనా ♦ పరతఁ దక్కి
కడుపు నిండంగ నూపిరిఁ ♦ గలిగి యుండు
నరునికాయంబు కాయమె? ♦ కరము పవన
భరితమై యొప్పు నొకచర్మ ♦ భస్త్రి గాక.

గీ. చిత్రకారునినిపుణతా ♦ శ్రీ వహించి
పొలుపు మీఱెడుగుడిమీఁది ♦ బొమ్మలకును
దయయు భావంబు లోనుగాఁ ♦ దలఁప లేని
కఠినజనులకు భేదంబు ♦ కలదె లవము.

గీ. చంద్రసూర్యాది గ్రహముల ♦ చలనమునను
నరునిజీవనపరిమితి ♦ నరయ నగునె
పరఁగ హృదయంబునందుండు ♦ ప్రాణవాయు
సంచలనమును దిలకించు ♦ సరణిఁ గాక.

గీ. సాధుజనులకు మోదంబు ♦ సలుపు నెవఁడు
శ్రేష్ఠతమ మగుకార్యము ♦ సేయు నెవఁడు
కరము యోచనాపరతను గ్రాలు నెవ్వఁ
డట్టిమనుజుఁడె చిరజీవి ♦ యవని యందు.

# క వి త.

ఉ. త్రేనుపు వచ్చునట్లు నును ♦ తీఁగల సీఁగలు నాఁడు నాఁడు పూఁ
దేనియ లాని యూరి మఱి ♦ తియ్యనిపట్టులు వెట్టు మాట్కి నా
నానిగమాగమప్రికట ♦ నాటకకావ్యరసంబు సత్కవుల్
వీనుల నాని కావ్యములు ♦ వింతలు పుట్ట రచింపఁగాఁ దగున్.

ఉ. వారును వీరు సేయ నల ♦ వడ్డముఖస్తుతి కుబ్బి పద్యపుం
గూరుపు నేరుపుం గుడితి ♦ కుండల లోనన యబ్బురంపుఁజే
బారలు వైవఁ బోయి నగుఁ ♦ బోటులపాల్పడ కుండు సాహితీ
సారరసార్ణవంబు నొక ♦ నారె కనుంగొనుఁ డయ్య సత్కవుల్.

మ. రసవంతం బగుపద్య మొక్కఁ డయినన్ ♦ రానిచ్చినన్ మేలు వా
కసిఁ జీబ్బం గను శుష్కపద్యశతముల్ ♦ కల్పింపఁ గా నేటికిన్
వసివాళ్వాడనిదివ్యదేశకుసుమ ♦ వ్యాసంగమో ప్రాజ్ఞ మా
నసవీథిం దిలకాష్ఠబంధనమొ యూ ♦ నందాక మూహింపుఁడీ.

శా. త్రియ్యభ్యర్హితసాధున్సూత్రనియమ ♦ భ్రింశంబు వాటింపకే
యొయ్యారంపుటలంకృతిధ్వనులు లే ♦ కుండం దఱిన్ వచ్చి కిం
శయ్యాకేళిని దేలునాశుకవితా ♦ స్వైరాభిసార్యంగనా
సయ్యోగంబు రుచించునే బుధులకున్ ♦ శశ్వద్యశోహేతువే.

చ. అలరులతావితానముల ♦ నాలన పాలనఁ జేసి తెమ్మెరల్
చెలు వగుఁధూళిఁ బ్రింగుఁగమఁ ♦ జిందర వందఱఁజేసి పయ్యెరల్
కలగుణముల్ గ్రహించి కృతు ♦ లన్ సుకవుల్ నుతిఁగాంతురన్యులి
మ్ముల మొదలూడ్చ నెంతురివె ♦ పో సదసద్గుణదోషహేతువుల్.

# చంద్రసేనవిజయము.

## జన్మము; బాల్యదశ.

చంద్రసేనుఁ డొక చక్రవర్తికుమారుఁడు. ఉత్తరహిందూదేశములోని రాజపుత్రస్థానమునందలి రెండు రాజ్యముల కీతఁడు కానున్న చక్రవర్తి. అయినను బాల్యమున నీతఁడు మిగుల దురదృష్టవంతుఁ డయ్యెను. ప్రేమాస్పద మగు జనకుని మొగమును జూచి మందహాస మొనరించు భాగ్య మీబాలునకుఁ గలుగలేదు. ఈబాలుఁడు రాజభవనమున జన్మింప నేలేదు. ఆతనికథ యిది.

ప్రస్తుత ముదయాపుర మున్న ప్రదేశముననే పూర్వము వల్లభపుర మను పట్టణ మొకటి యుండెడిది. అదియే యీరాజ్యమునకు రాజధాని. క్రీ. పూ. 436 వ సంవత్సరమున కమలవిజయుఁ డను రాజీ రాజ్యమును పాలించుచుండెను. ఆతని భార్య పేరు మధుసూదని. వారికిరువురకును ఏబది యేండ్లక్రిందటఁబరిణయ మయ్యెను. కమలవిజయున కిప్పుడు డెబ్బది యేండ్లున్నవి. మధుసూదని కరువది. ఇంతవఱకును వారికి సంతానము లేదు.

ఏండ్లకు పెద్దవా రయినను వారికడ వృద్ధచిహ్నము లేమియుఁ గాన్పించుటలేదు. శరీరమున ముడతలుగాని, నెరసిన వెండ్రుకలు గాని లేవు. వా రిరువురును ముప్పది యిరువది యేండ్ల యౌవనులవలెఁ గన్పట్టుచుండిరి. వారిరాజ్యము నందలి ప్రజ లందఱిలో నీదంపతులే యత్యంత సౌందర్యాధిక్యము నొందినవారు. విశేషించి మధుసూదని సౌందర్యమును గొనియాడని ప్రజ లీలోకమున లేనేలేరు.

పర్షియాదేశపు రాజగు నౌషర్వానుని పెద్దకుమారుఁడు గౌహర్జాం డను వాఁ డీమె యద్వితీయసౌందర్యమును విని యెట్లులయిన నామెను దనవశముఁ జేసికొనవలయు నను నుద్దేశముతో నపారసేనాసమన్వితుఁడై చాలమంది రాజులు తోడరుదేర వల్లభపురముపై వచ్చి విడిసి యీరాజునకు "నీ భార్యను నాకొసఁగి నీదేశమును గాపాడుము

కొనుము" నివర్తమాన మంపెను. లజ్జావిరహితమును నీచమును నగు నాసందేశమును విని కమలవిజయుఁ డాగ్రహావేశపరవశుఁడై తనసేనలఁ గూర్చుకొని రణరంగమున కేతెంచి యామ్లేచ్ఛులపైఁ గవిసెను. సమరవిద్యావిశారదుఁ డగు నీవిజయుఁడు పర్షియాదేశపురాజులలోఁ జాలమందిని దెగటార్చియు పారద్రోలియు విజయము నొందుచుండెను. కాని శత్రుసేనాసాగరమింకను నింకిపోలేదు. రణమున మిగుల నలసి డస్సియున్న భర్తనుజూచి మధుసూదని "నాథా! ఒక్కక్షణకాలము విశ్రమింపుఁడు. ఇంతలో నేనేగి రణమొనర్చుచుండెద"నని వేఁడుకొనియెను. చాలసేపటివఱకును కమలవిజయుఁ డందుల కీయకొనలేదు. కాని తుదకెట్లో సమ్మతించెను. పర్షియనుల కిది మహాద్భుతమయ్యెను. ఏసుందరీమణిని గొనిపోవ వారిట కరుదెంచిరో ఆయబలారత్నమే రణరంగమున భర్తను గూర్చుండఁజేసి శత్రులతో, పురుషులకంటె నధికముగఁ బోరాడుచుండెను. అందులకుఁ గొందఱామెను భూషించుచుండిరి. కొందఱు దూషించుచుండిరి. కొందఱు వీరస్వర్గమును జూడఁబోయిరి. కొందఱు పిక్కబలమును జూపుచుండిరి. అట్టియెడ కమలవిజయుని యానందము నేమని వర్ణింతును? మధుసూదనియే సత్యభామ. కమలవిజయుఁడే శ్రీకృష్ణుఁడు. శత్రువే నరకాసురుఁడు. పాఠకమహాశయులిఁక పోతనామాత్యుని కవితామృతమును గ్రోలుదురు గాక!

సీ. రాకేందుబింబమై రవిబింబమై యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్పకేతువై ఘనధూమకేతువై యలరు పూఁబోఁడి చేలాంచలంబు
భావజుపరిధియై ప్రళయార్కపరిధియై మెఱయు నాకృష్టమై మెలతచాప
మమృతప్రవాహమై యనలసందోహమై తనరారునింతి సందర్శనంబు
హర్షదాయియై మహాకోపదాయియై
పఱచుముగ్దరాలి బాణవృష్టి
హరికినరికిఁ జూడ నందందశృంగార
వీరరసములోలి విస్తరిల్ల.

కాని, పాపము మన విజయునకీ మహదానందము ననుభవించు భాగ్యమెంతో కాలమో పట్టలేదు. మధుసూదనిచే నోడింపఁబడి పారిపోయిన పర్షియాదేశపురాజొకఁడు చుట్టుత్రోవను తిరిగివచ్చి కమలవిజయునివెనుక పార్శ్వమునుండి తెలియకుండ కత్తితో వాతివి నొక్కపోటు పొడిచెను. రాణి యాధ్వని విని వెనుదిరిగి పడియున్న భర్తను

జూచి శోకించుచు నాతనికడకు వచ్చుచుండ నీచోక్తులాడుచు నాఘాతకుఁ డామెను బట్టుకొన దారికడ్డమరుదెంచెను. మధుసూదని యత్యంతకోపావేశమున నొక్కమ్మ నాతని వాతనేయనది కంఠమునఁజొచ్చి యాతనిఁ బొరిగొనియెను. పిదప నామెభర్త ప్రక్కఁగూర్చుండి యశ్రువుల నాతనిపై ప్రవహింపఁజేయుచు మరణవేదననొందుచున్న యాతని తుదివాక్యములను వినుచుండెను. చదువరీ! ఏబదియేండ్లనుండి యత్యంతానురాగముతో తనసేవసేయుచు, తనకై యెన్నఁడెఱుంగనిదైనను రణరంగమునఁ బడి శత్రులతోఁ బోరాడుచున్న సతీతిలకము నీలోకమున విడిచిపోవుచున్నప్పు డాతఁడేమి వచించెనో విన నీవాత్రపడుచుందువు. కాని యావిషయము నిప్పుడు వ్రాయుటకు నాకు కలమాడుటలేదు. ముందునకుఁ బోయెదను. పాపము దంపతులకిహలోకమున వియోగము సంభవించెను. రాణి మరల యుద్ధభూమికరిగి తన దుఃఖమునకు కారణుఁడైన గోహర్ జాంమను వధించి పగదీర్చికొనియెను. పర్షియా సైన్యము పూర్ణముగ నోడింపఁబడి పారిపోయెను.

ఆవీరనారి రాజభవనమున కరుదెంచి కొన్నిదినములటుగడపి, యొకనాఁడు కోశాగారమును దెరచి యందున్న ద్రవ్యమును తనభర్తకొఱకై ప్రాణములఁగోల్పోయిన వారి భార్యలకు వారి జీవనమున్నంతవఱకును కుటుంబరక్షణకు సరిపడునట్లొసఁగెను. మఱియు రాజభవనముననున్న గదులన్నిఁటికి బీగములు వేయించి వానిపై ముద్రవేయించెను. ప్రథానామాత్యునిఁబిలిచి «అమాత్యవరా! ఇదిగో ఈతాళము చెవులన్నియు నీకడ భద్రముగ నుంపుము. నాకిక్కడ బంధువులెవ్వరును లేరు. విజయపురముననున్న మాయమ్మకడకేగి నాజీవయాత్ర గడపెదను. నాకుమారునకు యుక్తవయను వచ్చువఱకును అక్కడ నుండెదను. బహుశః ఎప్పటికిని అక్కడనే యుండెదను. ఇక్కడకు మరల రావలెనను తలంపులేదు. నీవు రాజస్వవిషయిక కార్యములను జాగ్రతగ చూచుచుండుము. నీకుమారుఁడు మాపేరున రాజ్యమును పాలించుచుండును. నాకు తప్పక మొగశిశువు జన్మించునను నమ్మకముకలదు. పదికొండు పండ్రెండు సంవత్సరములు గడచినపిమ్మట నాకుమారుఁడు నీకడకువచ్చినప్పు డీసమస్తమును వాని కప్పగింపుము. నాబిడ్డకు చంద్రసేనుఁడను నామమిడెదను. ఇది బాగుగా జ్ఞాపకముంచుకొనుము" అని యాజ్ఞ యొసంగెను.

ఆరాత్రియే రాణి యొకగొల్లదాని వేషముధరించి రాజభవనమును విడిచి బయలుదేరెను. పాపమామె యారుమాసముల గర్భవతియై యున్నప్పుడు కొలఁదిదినముల క్రిందట శత్రువులతో మహారణమొనర్చుట సంభవించెను. ఇప్పుడు మరల నాగర్భ భారముతోడనే వల్లభపురమునుండి యొంటరిగ నొకదినము కాలినడకతో ప్రయాణము చేయుట తటస్థమయ్యెను. అయినను వానినన్నిఁటినోర్చి యామె నగేంద్రపురమునకు వచ్చి "యశోద"యని తనకు పేరుపెట్టుకొనియెను. తనభర్త యాకస్మికముగఁ గాలధర్మము నొందెననియు, తానొంటరికత్తెననియు, తనబంధువులు తనను బాధింపుచుండి రనియు చెప్పుకొనుచువచ్చెను. దయార్ద్రహృదయుఁడగు భూస్వామి యొకఁడీకథ యంతయును విని జాలినొంది యతనిపొలముకడ నద్దెలేకుండ చిన్నకుటీరము నొకదాని నామెకొసంగెను. ఆమెవచ్చునపుడు కొంతద్రవ్యమును తీసికొనివచ్చెను. అందుచే స్వల్పముగ నప్పుడప్పుడు కానుకలనొసంగియు, తాను చేసిన పిండివంటలు, కూరలు మొదలగువాని నిచ్చియు నామె యాభూస్వామి ఋణమును దీర్చుకొనఁగలిగెను. ఒక్కొక్కప్పుడు వారి యావులను కాచుచుండుమని యామెనడుగుచుండిరి. కాని యది తరుచుగాఁగాదు. గడచినదానికై దుఃఖింపకుండగను, కలతనొందకుండగను, అసంతుష్టి లేకుండగను, మధుసూదని కాలము గడపుచుండెను. గర్భమందున్న శిశువుకొరకై యామె తన ప్రస్తుతావస్థతో తృప్తినొంది సుఖముగాఁ గాలము గడపవలయునని యామెతలంచెను. ఒకటి రెండు పర్యాయము లామె విచారమునొంది ఏడ్చుచువచ్చెను. ఒకప్పుడామె యిట్లనుకొనియెను. "హా! భగవానుఁడా! తుదవఱకు నేనేల సంతానహీనురాలనై యుండకపోయితిని? నేనేల గర్భవతినైతిని? నానాథుఁడీలోకము నెప్పుడువీడిపోయెనో యాక్షణముననే నేనుగూడ నాజీవితమును త్యజించవలసినది. నాకట్టి మహాభాగ్యము సంభవింపదయ్యె. శిశువు జన్మింపగనే మేము వానిని చక్రవర్తిగాఁ జేయవలయునని యనుకొంటిమి. తోడిరాజుల నందఱను బిలిచి గొప్పయుత్సవమొనర్పవలయునని తలంచితిమి. పండ్రెండేండ్లు గడచినపిదప మారాజ్యపీఠము నాతనికొసంగి, యాతఁడు రాజ్యమును పరిపాలించుచుండ చూచి యానందింపఁగలమని యాశనొందితిమి. ఇంక నెన్నెన్నియో యూహించుకొంటిమి. కాని మాయాశలన్నియు హా! దైవమా! నిరాశలై పోయినవి. భగవంతుఁడీప్రపంచమున నాకింత సౌందర్యమేల యొసంగవలయును? నాకీచక్కదనమే లేకున్న మ్లేచ్ఛుఁడిటకు నచ్చుటయే సంభవింపదు. నానాథుఁడు

జీవించియే యుండును—ఇదియంతయు నీగర్భస్థశిశువుయొక్క దురదృష్టము. చక్రవర్తితోఁగూడి రాజభవనమున నుండుటకు మాఱుగ నొక గొల్లదానితో నీకుటీరమున నుండవలసివచ్చె. అక్రమముగా మనకీ కష్టములేల సంఘటిల్లుచుండునో, మన మెఱుఁగము. మనము గ్రహింపలేము. ఏదియెట్లయినను మనమేమిచేయఁగలము? గర్భస్థశిశువునకు హాని కలుగఁజేయుట దక్క దుఃఖించినందువలన నేమిప్రయోజనము?'' ఈవిధముగా తన జీవిత విషయమున నిర్లక్ష్యమును సూచించుచు ఒకనిమిషము దుఃఖము నొందుచు, ఆరెండవ నిమిషముననే కుమారునివిషయమున నెంతో యాశనొంది తానాతనికొఱకే జీవించి యుంటినని తలంచి తనంతట తానోదార్చుకొనుచుండును.

మధుసూదని సుకుమారియు, నిస్సహాయురాలును నగుటచే చుట్టుప్రక్కల స్త్రీలును, ఆభూస్వామిభార్యయును నామెయెడ మిగుల జాలినొంది యెంతోప్రేమను జూపుచువచ్చిరి. ఆమె ప్రసవమయినప్పుడు వారే చాలసహాయ మొనర్చిరి. ఆమెకొక శిశువు జన్మించెను. ఈతఁడే చంద్రసేనుఁడు. ఈతఁడే వల్లభాపుర చక్రవర్తి తనయుఁడు. అయినను తండ్రి యెవరో తెలియదనియు, ఆకుటీరముననున్న యశోదయను గోపికకు కుమారుఁడనియు పేరు "బాప'' యనియు మాత్రమే ఈతనింగూర్చి లోకమునకుఁ దెలియును.

ఈశిశువు చాలరూపవంతుఁడు. యశోద గోపవనిత యగునా గాదా యని మొదటినుండియు జనులెల్లరు సంశయించుచుండెడివారు. వారి యనుమానమిప్పుడు మరింత యధికమయ్యెను. బాలునకొక్కొక సంవత్సరము గడచినకొలఁది వారియనుమానము క్రమక్రమముగా వృద్ధియగుచుండెను. "బాప'' యనేకాద్భుతకార్యములను జేయుచుండెను. అట్టి కార్యములను గోపాలబాలుఁడు చేయగలఁడని యెవ్వరును స్వప్నముననైనఁ దలంపరు. మరియు నీతఁడా పట్టణమందుండు సమవయస్కులలోనెల్ల మిగుల దృఢశరీరియు రూపవంతుఁడునై యుండెను. మూఁడవసంవత్సరము మొదలు పదియవసంవత్సరము వఱకును నీతఁడొక చక్రవర్తి కుమారుఁడై యుండుననుకొనునట్లద్భుత కార్యములను జేయుచువచ్చెను. కాని తల్లిమాత్రమీతని కన్నఁడును వారి చారిత్రమును గూర్చి నిజమును చెప్పియుండలేదు. ఈతఁడు చాలగొప్పవాఁడగునని యందఱు ననుకొనుచుండిరి. కాని జన్మముచేతనే యీతఁడు గొప్పవాఁడని యెవ్వరును దలంపలేకపోయిరి.

# రెండవ ప్రకరణము.

## అరణ్యవాసము.

"బాప" నికి తొమ్మిది సంవత్సరముల యీడువచ్చెను. శరీరబలమునందును, అస్త్రకౌశలమునందును యువకులతో సమానముగనున్నను నీతఁడింటికడమాత్రము బాలునివలెనే సంచరించుచుండెను. తల్లి యీతనియెడ నెంతప్రేమమును జూపుచు నెంత జాగ్రత్త తీసికొనుచుండెనో, అంతకంటె నధికముగ ప్రేమఁజూపుచు నామెయెడ నెంతో భయభక్తులతో నీతఁడును మెలఁగుచుండెను. ఆడుకొనుటకై వీధిలోనికేగినప్పుడుదక్క మఱెప్పుడు నాతఁడామెను వీడియుండఁడు. ఆమె కేవేని వృత్తాంతములను చెప్పుటయన్నను, ఆమెప్రక్కను శయనించుటయన్నను, ఆమె చేతులతో పెట్టిన యన్నమును తినుటయన్నను, ఆతనికి చాలయిష్టము. ఇవియన్నియు బాల్యచేష్టలని యాతని హృదయమునకుఁ దోఁచలేదు.

ఒకనాఁడామె యన్నమును పెట్టుచుండఁగా నాబాలుఁడొక విషయమునుగూర్చి యామెను ప్రార్థించెను. అప్పుడు వారికిరువురకు నీరీతిగ సంభాషణము జరిగెను.

"అమ్మా! ఒకసారి దేశమంతయును దిరిగి యందుగల అద్భుతములఁ జూచి రావలయునని నాకభిలాష కలిగినది."

"బిడ్డా! వలదు. నీవింకను మిగుల పసివాఁడవు. నీకు పదునేను పదునాఱు సంవత్సరములు వచ్చువఱకును వలదు."

"అంతకాలమెందులకు! ఏండ్లు తొమ్మిదయినను పదునాఱేండ్ల యౌవనులకుండు నంతటిబలమును గలిగి యున్నాఁడను."

"వలదు. నీకనేక కష్టములు సంభవింపఁ గలవు."

"నేను మిగుల జాగరూకుఁడనై ప్రవర్తించెదను."

"ఒక్కొకప్పుడు నీవడవులవెంట వెళ్ళవలసివచ్చును. అచ్చట పాముల వలనగాని, పెద్దపులులమూలమునగాని మరియేక్రూరమృగములచేఁగాని యాపదలు వాటిల్లఁగలవు."

"అమ్మా! నేనిదివఱకనేక పాములను జంపితిని. నాబాణములచే క్రూరమృగముల సంహరింపఁగలను. ఇంతేగాక అడవులయందు దిరుగుటయన్న నాకెంతయో సంతోషము. అందు వేటాడుకొనుటకుఁ గావలసినరీతి సావకాశముండును."

ఆబాలుఁడు తెలివిగలవాఁడనియు, చురుకైనవాఁడనియు, ఆతనికిఁ దోచినత్రోవను బోనీయవచ్చుననియు, ఆతనిపూర్వు లీవయసునను, ఇంతకంటె కొంచెము వయసువచ్చిన పిమ్మటను ఏకార్యములను చేయనుద్యమించెడివారో యీతఁడును అట్టిపనులే చేయనభిలాషగలవాఁడనియు రాణి తెలిసికొనియెను. అయినను అంతబాల్యమున నాతని నొంటరిగ నీప్రపంచమున విడిచిపుచ్చ నిచ్ఛగింపకపోయెను. ఏదేని యుపద్రవముచే నాతనికి ప్రాణాపాయము సంభవించినను సంభవింపవచ్చును. ఎవరేని యాతనిని చక్రవర్తి కుమారుఁడని యానవాలుపట్టి వెల్లడి చేసినను చేయఁగలరు. అట్లయినచో నీబాలుఁడు సింహాసనమధిష్టించి శత్రులనుండి రాజ్యమును కాపాడుకొనఁజాలఁడు. ఎట్లయినను ప్రమాదమే. తుదకు పండ్రెండవసంవత్సరము వచ్చువఱకైనను, ఇంటనుండు నేని యిఁక భయములేదు. అతఁడెక్కడ కేగిన నేగవచ్చును. అందుచే నామె యతనివేఁడుకోలు నంగీకరింపక యాతని హృదయము కరగునట్లు మాటలాడఁ జొచ్చెను.

"బిడ్డా! నీవు పోవలదు. భవిష్యము నెవ్వరెఱుంగఁగలరు? నీవు సర్వదా జయమును గాంచలేక పోదువు. నీకేదైన యుపద్రవము సంభవించెనేని నేనిటు నిస్సహాయురాలనై పోయెదను.":

"అమ్మా! నాన్న పరలోకమునకేగినప్పుడు నీవొంటరిగ నుండలేదా? ఇప్పుడు నట్లే. అయినను నీకొక్కమాట చెప్పెదను. నేనెప్పుడును మిగుల జాగరూకతతో ప్రవర్తించెదను. నాప్రాణములకేమియు భయములేదు." ఆతఁడు తప్పకుండ పోదలచుకొనెనని యామెగ్రహించి నేత్రముల నశ్రువులు గ్రమ్మ నిట్లనియెను.

"తండ్రీ! నీవులేకుండ నేనొక్కర్తె నెట్లు జీవింపఁగలను?"

"అమ్మా! నాయనలేకుండ నొంటరిగ నెట్లుండితివి? నీవిట్లేడువకుము. నేనొక సంవత్సరముకంటె నధికకాలముండను. ఈలోపల నాకై బెంగపెట్టుకొని వ్యాధి నొందకుము. మనయెరుగుపొరుగువారిని నాస్నేహితులను నిన్ను జాగ్రతగఁ జూచుచుండుఁడనియు, ఏమేని కావలసినచో సహాయము చేయుచుండుఁడనియు చెప్పిపోయెదను."

ఆమరునాటి యుదయమున చంద్రసేనుఁడు నగేంద్రపురమునుండి బయలువెడలి మార్గమధ్యముననున్న నొకయరణ్యమున వేటకై ప్రవేశించెను. అతఁడెప్పుడును గొఱ్ఱె, లేడి, మొదలగు సాధుజంతువులనుగాని, సింహము ఏనుగ మొదలగు ఘనమృగములను గాని వేటాడెడివాఁడు కాఁడు. దుష్టస్వభావముగల పెద్దపులి మొదలగు క్రూరజంతువులను మాత్రమే యాతఁడు సంహరించుచుండెను. అట్టి మృగములకై వెదకుచుండ, నాతనిపైకి దుముకుటకై గొప్పపులియొకటి పరుగిడుచువచ్చుచు నెదుట గన్పట్టెను. భూమిపైనుండి కొట్టినచో గుఱితప్పిపోవునని యెంచి శరవేగమున నటనున్న వృక్షము నెక్కి యాతఁడు కొమ్మలనడుమ జాగ్రతగఁ గూర్చుండెను. పులి చెట్టుకడకువచ్చి పైకిచూచి భయాంకరముగ బొబ్బరించెను. చెట్టుచుట్టును దిరిగి పైకెక్కఁ బ్రయత్నించెను. భూమిపైవంగి పండుకొనెను. మరల నాకస్మికముగ గాండ్రుమని యొక్కకేక వైచెను. మరలిపోవు దానివలె కొంతదూరము పోయెను. మరల వెనుకకువచ్చి కొమ్మలపైకొక్క పట్టున దుముకుటకై యెగిరెను. బాలుఁడు రెండమ్ములను వైచెనుగాని పులి యిటునటు విరామములేకుండ తిరుగుచుండుటచే గుఱి తప్పిపోయెను. మంచిసమయమును చూచి గుఱి పెట్టి మూఁడవబాణముచే దానితలపై నొక్కదెబ్బ వైచెను. ఆదెబ్బకు పులి క్రిందపడిపోయెను. పులి జిత్తులమారియనియు, మోసముచేయుననియు నాతఁడు వినియుండుటచే నిఁక నొకబాణముచే తలపై మరల వేసెను. అప్పటికి నదియింకను చచ్చినదో లేదోయని యాతనికనుమానమే. కొంతసేపటివఱకును గనిపెట్టి చూచుచుండవలయునని తలంచి యాతడింకొక పైకొమ్మపైకెక్కి యాయరణ్యమున నలుదిక్కులు వీక్షించుచుండెను. ఒక్కింత సేపటికెవరో సన్యాశి యామార్గమునఁ బోవుచుండ నాతనినొక కేకవైచి యిట్లనియెను. “మహాత్మా! రెండుబాణములచే నేనీపులిని గొట్టితిని. పులి పడిపోయినది. కాని యది చచ్చినదో లేదోయని నాకు సందేహము. అది బ్రతికియుండిన నుండవచ్చును. నేనీచెట్టుమొదటకు వచ్చినప్పుడు నాపై దుముకుటకై ఇంతకుముందొకమాటిదియిట్లే పడియుండి నన్ను వంచింపఁ జూచినది. అందుచే నేనీచెట్టుపైనుండి దిగుటలేదు.”

“బిడ్డా! భయములేదు. పులి చచ్చిపోయినది. ఇష్టముండెనేని నీవు దిగవచ్చును.”

బాలుఁడు చెట్టునుండిదిగి యాతనిని వెంబడించెను. వారిరువురును నడచిపోవుచున్నప్పుడాతపస్వి నాబాలుఁడెన్నియో ప్రశ్నముల నడుగ నాప్రశ్నలకన్నిఁటికిని సన్యాశి ప్రత్యుత్తరముల నిచ్చుచుండెను.

# రాజపుత్రవిజయము.

## ప్రథమాంకము.

### ఢిల్లీదర్బారు.

[నాజరుద్దీను, గయాజుద్దీను, జలాలుద్దీను, రహిమాన్ ఖాను, సలీము ఉచితాసనంబులఁ గూర్చుండి కొలువుఁ దీర్చియుందురు.]

నాజరు—అమాత్యవరా! మదీయ నిరంకుశ పరిపాలనంబునంగల, యార్యావర్త మండలి సామంత నృపతు లెల్లరుఁ దమపైని విధింపఁ బడిన కప్పంబుల నీఢిల్లీసింహాసనంబున కర్పించిరే?

గయాజు—ప్రభువరేణ్యా! రాజపుత్రస్థానమండలి యగ్గళపురాధీశ్వరుండ వయిన గౌతముండను రాజపుత్రసామంతుఁ డొక్కరుండు దక్క, దేవర పాలనంబునంగల సామంత భూమిపులందఱుఁ దమతమ విధాయకములైన కప్పంబుల నొప్పిదంబుగ నొప్పగించిరి.

నాజరు—అతండేటికిఁ జెల్లింపకుంటకుఁ గారణంబేమి?

గయాజు—దేవరవారి కరుణామయంబయిన శాంతస్వభావమే ముఖ్యకారణము.

నాజరు—ఏమి? ఢిల్లీసింహాసనంబున కాతండరిఁ జెల్లింప నుల్లంఘించెనా?

గయాజు—ఉల్లంఘించుట యొకటిమాత్రమే కాదు. అవినీతుఁడై, మితిమీఱి తనతోడి రాజపుత్రసామంతజననాథులకుఁ గూడ “నరిఁ జెల్లింప నలద”నియును “మన మందర మేకీభవించి యెదిరించినఁ బాదుషా యొక్కరుం డేమి చేయఁగలఁడ”నియుఁ, గుత్సితబోధలఁ జేయుచు, వారికి మనయం దలక్ష్యము బొడమింపఁ బ్రయత్నించుచున్నాఁడు.

రాజు—(కోపముతో) ఆ! ఏమి వానికండకావరము? "పెంచినకుక్క కాలుఁ గఱచె" నన్నటు, లాకృతఘ్నుం డక్రమపథానువర్తియై, పరిభవతిరస్కారం బొనరించెనా?

గయరాజు—"పుణ్యమని యెంచి చేసినఁ బాపమొదవె" ననునటు లాదియం దారాజపుత్త్రుల నాజియం దకాలమృత్యువువాతఁ బెట్టకుండఁ గాపాడి, కప్పంబులఁ గట్ట నొప్పించి, సామంతులఁ జేసికొని, యెవరిరాజ్యంబులను వారికిచ్చినందుల కాతఁడీపనిఁ జేసెను.

రాజు—అవునవును. నిజమాడితివి. ఇఁక వాని నుపేక్ష సేయరాదు. బలంబులఁ బంపి పురంబు నొక్కుమ్మడిని ముట్టడివేయించి కొల్లఁబెట్టించి యా దోసకారిఁ బట్టి తెప్పించి చెఱయం దుంచెదఁ గాక.

గయరాజు—చిత్తము.

రహీమాను—దేవా! భారతీయులు కృతఘ్నులు. మేకవన్నె పులులచందంబునఁ బైకి సాధువులుగాఁ గనుపడుదురు. వారికేమాత్రము వీలు చిక్కినను మన రాజ్యమంతయు నపహరించి పఠానులఁ బాఱఁదోలఁ గుచ్చులక్రింది త్రొచులగతిఁ దఱివేచియున్నారు. అట్టివారిఁ గత్తిఁజూపి పాలింపవలయునే కాని దయయనుమాటఁ గలనైన జూపరాదని నేను మీకు మొట్టమొదటినుండియును విన్నవించుకొనుచునే యున్నాఁడను. అయిన నేమి? నాపలుకు లరణ్యరోదనములే యైనవి. ఎవ్వరికిఁ గాని యుపదేశజ్ఞానముకన్న ననుభవజ్ఞానమే యుత్తమోత్తమము.

రాజు—(కొంచెమాలోచించి తలపంకించి) మంచిది. "భూతే పశ్యంతి బర్బరాః" అనునటుల నీగతజలసేతుబంధనముతో నేమిపనిగలదు? ఇప్పుడు మించిపోయిన దన్నియును లేదు. ఇఁకనైనను భవిష్యత్కార్యనిర్వహణక్రమంబున నప్రమత్తులమై యుండవలయును.

జలాలు—(రౌద్రముతో విజృంభించి లేచి నిలిచి) దేవరవా రీస్వల్పకార్యమునకై యింతగఁ జింతిల్లఁ దగదు. ఇక్కార్య మీసేవకునిశక్తికి మించినది కాదని నొక్కి వక్కాణింపఁగలను. యుద్ధమునం దారాజపుత్త్రానీకములందఱు నేకీభవించినను నన్ను జయింపఁ జాలరు. నాకా గౌతమునిపైని దండు వెడల ననుజ్ఞ నొసంగుఁడు. ఆరాజ

ద్రోహిం బట్టితెచ్చి కారాగృహంబున నుంచి యాతని రాజ్యంబు సర్వస్వంబును బాదుషావారికి సమర్పించుకొనఁగలను.

సలీము—జలాలుద్దీన్! నీవేకాదు. నేను వయ్యాగ్రశసంస్థానాధీశుండగు గౌతమ క్ష్మాజాని నెఱుంగుదును. అతం డనేకప్రకారప్రియశాలి. అమ్మహీపతి నెదిరించు సమరంబునందు మనమునలువురము నేకీభవించి మొక్కపట్టునఁ దలపడినను గెలువఁ జాలమని నిశ్చయంబుగఁ జెప్పఁగలను. కనుక నీలేనిపోని ప్రగల్భంబులఁ గట్టిపెట్టి చతురోపాయంబులఁ బ్రయోగించి యాతని నోడింపయత్నింపుము. అటు చేయనొల్లక ముంగు వెనుకల నాలోచించుటమాని దుడుంగు మనివఁ గాలముపైచి చేపఁ బట్టఁజాలని జాలరి విధంబునఁ దొందఱపడి కయ్యమ్మునకు కాలుదువ్వుదువేని పరాభవంబుఁ బొందిరాఁగలవు. సావధానమ్ముగ నాలోచించుకొనుము.

జలాలు—(కోపముతో) ఓసీ! పందా! అబలలచందంబున వరివీరుల నెదిర్చి నిలువలేక యింటఁజొచ్చి పిల్లిమీఁద నెలుకయు నెలుకమీఁదఁ బిల్లియు నెక్కించి వినోదించు మూఢులగతిఁ గుయుక్తులఁ బన్ని యభాండలాభన్యాయంబుగఁ బగను సాధింపఁజూచు భీరాగ్రేసరచక్రవర్తులగు భారతీయులలోనివాఁడ వగుటచే నిట్టి కుత్సితాలాపంబులఁ బ్రేలుచుంటివి. పిఱికికంఠయన నేమియు నెఱుంగని పఠానువంశయోధాగ్రేసరులమగు మేముమాత్రము నీదు ప్రలాపంబులను లెక్కసేయము. వేయేల? వైరుల నెదిరింపఁగల మేటిమగండ వైతివేని ఖడ్గపాణివై రణరంగంబునకేగి రసపుత్రులఁ గెలిచి పాదుషావారి వలన నమితంబుగ మెప్పువడయుము. పురుషజన్మంబును సార్థకపఱచికొమ్ము. కాదేని గాజులఁదొడిగించుకొని యిలుమాఱి వెచ్చఁగఁ గూరుచుండుము. నీయవసరమిం దెంతమాత్రమును లేదు. ఇఁకను నీవు వాగ్వ్యయం బొనరింపకుము.

సలీము—(కోపముతో విజృంభించి) ఓరోరి! వృథావాచాటా! ఎట్టెటో పాదుషాగారి యనుగ్రహంబుఁ బడసి యయోధ్యాపుర పాలకుండవయి తన్మాత్రలాభంబునకే గర్వించి మైమఱచి మన్నును మిన్నునుఁ గానక నాయంతవారలు లేరని విఱ్ఱవీగుచు బరాధీనలైన సాధ్వీమణులఁ బట్టి బలిమిం జెఱఁబట్టుచుఁ ద్రోహదోపిడులఁ జేయించుట యం దారితేఱిన జారచోరాచారపరాయణుండ వగు నీవా నన్నాక్షేపించువాఁడవు నీపౌరుషం బెంతమాత్రమో నాకుఁ దెలియకపోలేదు. "కోతిఁజూచి యిది తిమ్మనయన

నా పేరును నీకెవరు చెప్పిరి? యని యడుగ నీముఖమే చెప్పుచున్నది'' యనునటులు నీ వెంత పోటుమానిసివో నీకొలంబే విశదీకరించుచున్నయది.

జలాలు—ఛీ! ఛీ! నీచప్రలాపీ! నోరు మూయుము. నేను బానిసవంశీయుండ ననియా నీవాక్షేపించుచుంటివి. నీకుమాత్రమిం దెక్కుడగౌరవ మేమియబ్బెను. కాలవశతంజేసి నేనొకానొకప్పుడుబానిసనే యైతిఁ గాని నీవు బ్రతుక నేవెఱవుఁ గానక స్వమతం బుల్లంఘించి పరమతాంతరుఁడవై మాయట్టి బానిసకులమువారినే కొలుచుచుంటివి. దీనఁజేసి నీవు మాకన్న నధమాధముఁడ వనందగును. వెండియును—

"శ్లో॥ కింకులేన విశాలేన విద్యాహీనేన దేహినాం
దుష్కులంచాపి విదుషో దేవైరపి సుపూజ్యతే.''

అనునట్లు కులముతో నేమియుఁ బ్రయోజనము లేదు. పురుషుని యభ్యుదయ పరంపరావాప్తి కాతని పౌరుషజ్ఞానములే మూలములు.

గయాజా—(స్వగతము) ఈతండు మాటమాటకును బానిసీయులని మాకులంబు నెత్తిపొడిచి చెప్పుచు మాయొక్క గుట్టంతయును వెల్లడింపఁ బ్రయత్నించుచున్నాఁడు. ఇఁకను వీని నెటులయినఁ బదభ్రష్టుఁ జేయ నాలోచింపవలయును. (కొంచె మాలోచించి) ఆ. మంచిసమయము దొరికినది. పాదుషాయును మాకులంబులోనివాఁడగుటచే నీతని పలుకు లాయనచెవులకు ములుకులవలె నాటి కోపాగ్నిఁ బుట్టింపకపోనేరవు. ఇఁక నాయగ్ని మదీయ వాక్పటిమయను ప్రచండమారుతంబుచేఁ బ్రజ్వలింపఁ జేసెదఁగాక (ప్రకాశముగా) దేవా! ఈసలీమిపుడు మన మహమ్మదీయమతావలంబియైనను బుట్టువువలన నారాజపుత్రవంశీయుండగుటచేఁ దన తొంటి మతాభిమానం బెడఁబాయఁజాలకయో లేక యాగౌతమునిపైఁ గల తొల్లింటి చుట్టఱికంపుఁ బ్రేమను మఱువఁజాలకయో యవ్విభునిపై నీఁగవ్రాలినఁ గత్తిదూయుచు నాతని కెనయగు బల ధన శౌర్య ధైర్య గాంభీర్య పరాక్రమౌదార్యంబులం గలిగిన యోధాగ్రేసరుండగు నృపవరుం డొం డిహంబున నే లేఁడని ప్రగల్భంబులఁ బలుకుచున్నాఁడు. ఈసలీముమూలముననే యాగౌతముండు దేవరవారి నింతగఁ దృణీకరించి వ్యవహరించుచున్నాఁడు. ఈతండు కపటస్వభావుండు. దేవరవారి యాస్థానంబునంగల రాజకార్యనిర్వాహకకర్తలగు సచివులలో నీతండొకం డయ్యును దేవరసమ్ముఖమునం దుండునంతసేపు దమపైఁ గుటిలప్రేమ

జూపుచు సక్రవినయంబులఁ గలిగి మెలంగుచు నీయాస్థానమందలి రహస్యవిషయంబుల నారాజపుత్రనృపతుల కెఱింగింపుచు భారతీయుల నిత్యాభ్యుదయంబును, మన సర్వనాశనంబునుఁ గోరి పయోముఖ విషకుంభంబుఁ బోలి దొంగవాకిట మంచముపై చిక్కొని పరుండువానిభంగిఁ జరించుచున్నాఁడు. ఈతండు మన కపకారికాని యుపకారి కాఁడు. దేవరవా రమాత్యునిగా నింక నీతని సంగీకరించుటకన్నఁ బ్రక్కయం దొకబల్లెంబును దలక్రింద నొకపాము నిడికొని నిదురించిన మేలే!

రహిమాను—ఈతండు దేవరవారి యాస్థానమునం దమాత్యునిగా సంగీకరించిన దినము మొదలుగ నీనాఁటివఱకు నీతని చర్యల నేను స్వయముగఁ గనిపెట్టుచునే యున్నాఁడను. పాదుషావారి కార్యములం దీతం డెప్పటికప్పుడే యిట్టి కుశంకలఁ గల్పించి నుడువుచు స్వామిహితపారాయణులమగు మాకు నిరుత్సాహంబును బగతుల కుత్సాహంబు నొదవించుచున్నాఁడు.

రాజు—(కోపముతో) అవునవు నీతం డట్టివాఁడే. ఇఁక నీనీచు నీయాస్థానమునం దుండనీయరాదు. ఆవలకు వెడలఁ గొట్టుఁడు.

సలీము—(దీనుఁడై దుఃఖముతో నంజలిపట్టి) స్వామీ! పాదుషావారికి నేనెట్టి యపచారంబును సలిపి యుండలేదు. వీరిరువ్వురును దూరాలోచనలేని పరమదుర్మార్గులు; తోడిదొంగలు. ఇట్టివారి మాటలఁ బాటిసేయకుఁడు. నేను పాదుషావారి యాస్థానమునం దున్నచోఁ దమ కుత్సితాలోచనలును దుర్మార్గపునడతలును గొనసాగ నేరవని వెఱఁగందియిట్లనుచున్నారు.

రాజు—(రౌద్రముతో) ఓరీ! కృతఘ్నా! రాజద్రోహీ! నోరు మూయుము. నీ వీయాస్థానమునం దుండఁ దగవు. ఆవలకుఁ బొమ్ము. పోకున్న నీయసికి నీయుసురులం బలి యిచ్చెదను.

సలీము—చిత్తము (అని విచారముతో నావలకుఁ బోవును.)

దౌవారికుఁడు—(ప్రవేశించి) పాదుషావారికి సలాములు.

రాజు—ఏమియిట్లువచ్చితివి?

దౌవారికుఁడు—దేవా! ఎవ్వరో రాయబారి యొకం డెందుండియో వచ్చి దేవర దర్శనార్థమై ద్వారంబునఁ గాచి యున్నవాఁడు.

నాజరు—సత్వరంబుగ నాతని నిందుఁ బ్రవేశ పెట్టుము.

దౌవారికుఁడు—చిత్తము (లోపలికి పోయి యొకయోగితోఁ దిఱుగ బ్రవేశించి) వారే పాదుషావారు. నీవు వచ్చినసంగతిని వారికి విన్నవించుకొనుము. (అని యావలకు పోవును.)

యోగి—ఢిల్లీ సింహాసనాధీశున కభివాదనము.

నాజరు—ఓయీ! నీ వెవ్వరవు? నీ వెందుండి యిందుల కేమిపనిమీఁద వచ్చినాఁడవు?

యోగి—అగ్గళసంస్థానాధీశ్వరుండయిన గౌతమనరేంద్రుని పంపున మీకడకు వచ్చిన రాజదూతను.

నాజరు—మీరాజు మాకుఁ జెల్లింపవలసిన కప్పంబుఁ దీసికొనివచ్చితివా?

యోగి—లేదు.

నాజరు—మఱెందులకు వచ్చితివి?

యోగి—మానృపవరేణ్యుండు మీకుఁ గొన్ని రాజకీయవిషయంబులఁ జెప్పిరమ్మని నన్నంపెను.

నాజరు—అవి యేవి?

యోగి—సావధానుఁడవు కమ్ము.

నాజరు—మంచిది.

యోగి—

సీ. అనపాయకరమతిలో ♦ నాలమందలఁబట్టి
వధనొనర్చినయట్టి ♦ పాపఫలము
బహుపవిత్రములైన ♦ భగవదాలయములఁ
బాడుచేసినయట్టి ♦ పాపఫలము
నసిఁబూని బెదరించి ♦ యార్యులనోట గో
పలలంబు నిడినట్టి ♦ పాపఫలముఁ
బడరానికష్టముల్ ♦ పడి గడించినసాధు
భాగ్యాళిఁ గొనినట్టి ♦ పాపఫలము

తే. గీ. వనఁగ నివి యెల్లకాలంబు ♦ లందు నీకుఁ
దప్పు విడువటు నేఁడేఁడు ♦ తరములకును
పరమునందును నిహమునందుఁ ♦ బట్టి నిన్నుఁ
గుడిచెఁ గుడుపుచునున్నవి ♦ కుడుపు నింక.

నాజరు—(కోపముతో) ఆతండు నిన్ను నాకీ పుణ్యపాపంబులం దెలుపఁ బంచెనా?

యోగి—అవును. ఇంకను నీవు ముఖ్యముగా వినవలసినది మఱియొకటి కలదు. వినుము.

సీ. పరమభక్తులమీఁద ♦ వైచినతలపన్ను
బండెల నీకు రద్దు ♦ పఱచు టొకటి
భరతసంతతివారి ♦ పరమపూజ్యములైన
గోవుల వధియింపఁ ♦ గూడ దొకటి
ఆర్యమతాంతరు ♦ లర్చించు దేవళం
బులఁ బాడుచేయంగ ♦ వలవ దొకటి
రసపుత్రులందోలి ♦ వెసఁగొన్న రాజ్యముల్
వారలకర్పించి ♦ బ్రతుకు టొకటి

తే. గీ. మొత్త మీనాలు గిచ్చలు ♦ రిత్త యనక
నీవు కూరిమి నెంచి మ ♦ న్నింప వలయు
నటులుఁ గాదన్న నసిఁబూని ♦ యాలమునకు
వచ్చి మగతనమది కనఁ ♦ బఱుప వలయు.

నాజరు—(కోపముతో) సరే. ఇఁకఁ జాలింపుము. ఏమి? సామంతుండై కొలఁది నేల నేలుచు నల్పసైన్యాధ్యక్షుండగు గౌతముండు, రాజాధిరాజునై నిరంతరకో పరిపాలనం బొనరింపుచు నపరిమితభూభాగంబునుం గలిగి యగణిత సైన్యాధ్యక్షుండనగు నన్నెదిరింపఁబూనెనా? మంచిది. ఇయ్యది తలంప నొకదోమ మత్తేభముతోఁ బోరాడఁ బోయినట్లున్నది—

యోగి—(స్వగతము) సింగంపుఁగొదమ యేనుగగున్నపై నురుకు నట్లున్నది.

రాజు—ఈమాత్రపుఁ జిన్నపనికి నేనేల? మా సరదారులలోపల నెవ్వండైన నొక్కరుండు పోయి నిముషకాలంబులో నాపనిని నెరవేర్చి రాఁగలఁడు. కనుక నీవు మాఱుమాటాడక యీవచ్చిన దారినే యయ్యాగ్రపురంబునకేగి పాదుషావారు నీవు కోరిన కోరికలలోఁ జివరదానిఁ జెల్లించెద మనిరి యని చెప్పుము. పొమ్ము. నీ విఁక నిందు నిలువకుము. త్వరపడుము.

యోగి—(నిరసనభావముతో) వచ్చినవారము పోక యిందు కాపురముండము. కాని నీ వీవృథాప్రగల్భంబులఁ గట్టిపెట్టి యిమ్మంత్రివర్గంబుపైఁగల నమ్మకముఁ దిగనాడి క్రోధంబుఁ జంపికొని బాగుపడఁ దలంచితివేని నాహితోపదేశంబుల నాలకించి బుద్ధిఁ దెచ్చుకొనుము.

రాజు—(క్రోధముతో) ఓరీ! మూర్ఖా! వృథాప్రలాపీ! నీ వీయనవసర ప్రసంగ మొనరించెదవేల? ఆవలకుఁ బొమ్ము. పోకున్న—

యోగి—(అర్ధోక్తియందు చిరునగవుతో) పోకున్న నీ వేమిచేయఁగలవు? ఎట్టు లయిననేమి? నే నిటఁ జాలకాల ముండు టనుచితం బగుట నీవు విన్నను వినకున్నను నావిధి ననుసరించి నే నొకింత తడవు నీ కుపదేశింపఁ దలంచితిని. శ్రద్ధతో వినుము.

సీ. భారతీయులమీఁదఁ ♦ బగఁబూనుటది తన
యింటికి నగ్గిదా ♦ నిడుటసుమ్ము
రాజపుత్రులతోడ ♦ రణమొంచుటది శల
భంబు కార్చిచ్చునఁ ♦ బడుటసుమ్ము
భరతసంతతి ననా ♦ దరణ సల్పుటది స్వ
సంతతిఁ బాసిపోఁ ♦ జనుటసుమ్ము
ఆర్యమతములకు ♦ హానిసేయుటది యా
త్మీయమతమునకుఁ ♦ దెగులుసుమ్ము

తే॥ గీ॥ కాన మీకును మాకును ♦ లేనిపోని
పగల నిఁకనైన మాపుకోఁ ♦ దగును సుమ్ము
తథ్య మిదియంచు మదియందుఁ ♦ దలఁచి కొమ్ము
"ఆత్మవత్సర్వభూతాని" ♦ యనుచు నమ్ము.

శ్రీ

# మయూరసింహాసనము

## మొదటి ప్రకరణము.

యమునానదీజలంబుల నుదయసమీరుఁడు చిఱుకెరటంబులఁ గల్పించుచుండెను. సూర్యకిరణములు లేతరంగములపై వజ్రపుఁదళుకుల వెదఁజల్లుచుండెను. జలవిహంగములు మునుంగుటలలో నాటలాడుచుఁ గ్రీడావినోదంబుల మైమఱచియుండెను. జలవిహంగముల సౌఖ్యోన్నతిఁ బొగడు వందిమాగధులనఁ దత్ప్రాంతవనవిహంగములు వివిధకూజితముల రోదసి నింపుచుండెను. మనోహరపక్షిగీతంబులనాలకించుచు నవ్వన మధ్యమార్గమున నిర్వురాశ్వికులు పోవుచుండిరి.

అందు మొదటఁ బోవువాని యంగసౌష్ఠవ మప్పటిసృష్టిరామణీయకమున కనుగుణ్యమై హృదయాకర్షకముగనున్నది. విగ్రహము పొడవుగనుఁ దగినంతపుష్టిలేకున్నను గాయశరీరమును రాజిల్లుచుఁ దీక్ష్ణాతపంబున నిసుమంత మిసిమి తగ్గినపసిమికాంతులచే హృదయరంజకముగఁ గాన్పించును. వదన మంతవట్రువగ నుండక పోయినను, విశాలనేత్రములతోడను దీర్ఘకర్ణములతోడను, యౌవనప్రారంభసూచకంబులగు నూనూఁగు మీసములతోడను, దేజరిల్లుచు యువతీమణులకు విస్మయశిరఃకంపముల జనింపఁ జేయుచుండు నని చెప్పవచ్చును. దక్షిణభుజమునుండి వ్రేలు బాణాసనంబును వామభుజంబునఁ గ్రాలునంబులపొదియు, నాతఁడు బాణవిద్యారతుఁడని తెలుపుచుండెను. అప్రయత్నలీలచే నాతఁడు గుఱ్ఱము నడుపురీతిఁ గాంచిన నాతనియశ్వారోహకౌశలంబు స్పష్టమగుట

మానదు. రాచకట్టుగఁ గుచ్చెళ్లు వెనుకకు బిగించికట్టిన కట్టుతీరును, తొడుగుకొనినబొందులపాంబట్టునిలువుటంగియును, నృపాలురు ధరించు కిరీటమునుబోలి శిరంబు నాచ్ఛాదించుచున్నకుసుంబాపట్టుకుల్లాయియును, గళ్లపట్టురుమాలున వ్రేలుకొంబలోనిఖడ్గంబును, నాతఁడొక హిందూసామ్రాజ్యంబున జనియించిన శూరాగ్రేసరుండని చాటుచుండెను.

ఆతఁడెక్కినహయము మత్యున్నతమై మొగంబునఁ బాదంబులఁ దెలుపును, శరీరమంతటనున్న నైల్యమును గలిగి మిగుల నుత్తమజాతిని జనించిన పంచకల్యాణియనఁ జెల్లుచు రౌతునకుందగినవాహనమై తనరారుచుండెను. కళ్లెముబిగింపునఁ గుంచితమైన మెడయును, నాశ్వికునిమనోగతి నవలీల గ్రహించి నెఱపుచున్నగమనలీలయు హృదయాకర్షణము లగుచుండెను.

ధరించినదుస్తుల తారతమ్యమును బట్టియు, నెక్కినగుఱ్ఱముల జాతిభేదములను బట్టియు, విగ్రహవిలాసభేదమును బట్టియు, ద్వితీయాశ్వికుఁడు మొదటివాని సహచరుఁడని విస్పష్టమగుచున్నది. రాచకట్టుగ బిగించిన వెలిపుట్టంబును, దెలిరుమాలునిలువుటంగియును, మునుగొంగు వీపున జీరాడునట్టుల చుట్టిన తెల్లనికుచ్చుతలపాగయును, నాతని సామ్రాజ్యభాగ్యవశను మాత్రమె వెల్లడిచేయుచున్నను గట్టిగబిగించిన రుమాలునుండి వ్రేలుకృపాణంబును, వీపునవ్రేలు ధనుర్బాణాదిసాధనంబులును, యజమానునకుఁ దగినసహచరుఁడనియు, సమయము వచ్చినపుడు శౌర్యత్వము వెలిపుచ్చు యోధవీరుఁడనియు, విశదీకరించుచుండెను. వయసున నలువది వత్సరములు మించినవాఁడయ్యు బలిష్ఠావయవములచే నొప్పారుచు, ముప్పదులు మించనివానివలెఁ గాన్పించును. చామనచాయశరీరమును నచ్చటచ్చట ననసన్నని స్ఫోటకపుమచ్చలు దాల్చినమొగమును సౌందర్యవంతుఁడని తెల్పలేకున్నను, నశిదిరిగిన నల్లనిమీసములును విశాలఫాలం

బును జొచ్చుచుండగిన స్థూలముగలవిగ్రహమును గాంచినదో నొక సతీమణిగాఢానురాగమున కొనసాగుచు గాకపోడని చెప్పవచ్చును.

ఇట్లు వెనువెంటఁబోవు సహచరుఁడు యజమానునితో “సంగర సింహా! మనయెడమప్రక్క దూరమునఁ గాన్పించునది సింహముకాఁబోలును. మనప్రయాణమునకు ఋజుమార్గ మగునాయ మైనను నియమాను ప్రాణమునకు హానిని గుర్తించి యుండితిమి” అనియెను.

సంగర—సమమోచితముగఁ బరిశీలించితిని. శరకౌశల్యమును జూపవేడుక పుట్టుచు న్నది.

అని గుఱ్ఱము నావలనికి మరలించి యంతదూరముపోయి “మిత్రమా! దీనాలాపము లెవ్వియో వినవచ్చుచున్నవి. స్త్రీకంఠమువలెనున్నది” అనుచుంతలో శరవేగమున నాయిరువు రొకచెట్లతోపును సమీపించిరి. ఆవృక్షజాలముకవ్వలఁ గొలఁదిదూరములో నిరువదిమంది ఖడ్గపాణులై రెండుబారులుగ నిలుచుండిరి. వారికవ్వల నొకమంటపమున భయంకరమైన కాళీవిగ్రహము కాన్పించుచుండెను. దానిముంగిల ఖడ్గపాణులమధ్య నొకయువతిరత్నము గడగడవడంకుచు నశ్రుధారలు కాల్వలుగట్టి ప్రవహియింపఁ దనుపుమండ గద్గదస్వరంబున “ఈకిరాతులు నన్నీకాళికి బలి యిచ్చుచున్నారు. అయ్యో! ఈమహారణ్యములో నీదిక్కుమాలినదానిని గాచువారెవ్వరు—అన్నలారా! నాశరీరమునందలి యాభరణములతోఁ దృప్తిఁబొందుఁడు. నన్ను హింసింపకుండ విడిచితిరేని మీకు ధనరాసుల నర్పింపఁగలను. ఏల వృథాపాపమ్ము నాగ్రహించెదరు?” అని ప్రలాపింపఁ దొడఁగెను.

అంతనొక దీర్ఘకాయుఁడు ముందుకువచ్చి “దేవికి బలియగుటకు సిద్ధముగ నుండుము” అని యాసుందరి కంఠము నుత్తరింపఁ గత్తినెత్తెను. సంగరసింహుఁడు వృక్షములచాటుననుండి యొకబాణమున నాహస్తము తెగఁజేసి వానియుద్యమమున కంతరాయముఁ గలిగించెను. ఖడ్గపాణులు

హాహాకారధ్వనులతో బాణమువచ్చినదై పుడకఁ జూపులు నిగుడ్చి "పట్టుఁడు! నఱకుఁడు! ఒకరికి మఱిద్దఱు దొరకి"యనుచు నాశ్వికులఁ గవిసిరి. సంగరసింహుఁడును నాతనిసహచరుఁడును, పిఱువిడియక శరపరంపరలఁ బ్రయోగింప సాగిరి. ఆటవికు లాశ్వికుల నలుపట్టుల ముట్టడించి కరవాలంబులం ద్రిప్పుచు డాసి చెండాడఁ బ్రయత్నించుచుండిరి. ధనుర్ధరులొకరొకదిక్కునకును, వేఱొకరు పిఱుందు దెసకును మొగమై నిలుచుండి నలు దిక్కుల బాణవర్షము గురియింపసాగిరి. తదీయధనుర్జ్ఞానకౌశల్య మత్యద్భుతముగ నుండె. వారు ప్రయోగించు శరమొక్కటియు వ్యర్థపోవుటలేదు. ఆటవికుల ఫాలతలములు హృదయములు కంఠములుఁ దదీయశాతశిలీముఖముల కగ్గమగుచు వ్రయ్యలగుచుండె. అర్ధచంద్రబాణహతిచే శిరంబులు డొల్లుచుండె. హస్తములు పాదములు తెగిపడి దవ్వులకుఁ జెదరుచుండె. ఆటవికులు తమబలంబు క్షీణమగుచుండుటఁ గాంచియు, బిఱువిడియక కత్తిసాముఁ శరహతిఁ దప్పించుకొనుచు నతిసాహసమున నాశ్వికుల సమీపించి ఖండింపఁ బ్రయత్నించుచుండిరి. ఈయత్నమున నిష్ఫలులై తమలో హతులైన వారి ఖడ్గములఁ గొని యాశ్వికులపై విసరఁజొచ్చిరి. ఆకత్తి వ్రేటులచేఁ దనగుఱ్ఱమున కొకటియు, సహచరుని కుడిభుజమున కొకటియు వానిహయమున కొకటియు, గాయములు తగులుటచే సంగరసింహుఁడు తీవ్రకోపమున నిశితనారాచములఁ బ్రయోగించి తమపై వచ్చు కృపాణముల నడుమన త్రుంచుచు శత్రువుల శరీరముల గాడనేసి నేలఁగూల నేసెను. హతశేషులిరువురుమాత్రము కాళ్ళైవై పుడకఁ బలాయమానులైరి. పిక్కబలముఁ జూపుచు మంటపము సమీపించుసరికి సాహసింహుఁ డాయిరువురఁ జేరి యొకబాణమున నేలఁగూల్చెను.

## రెండవ ప్రకరణము

VIRASALINGAM YOUNG MEN'S PUBLIC LIBRARY * RAJAHMUNDRY.

కిరాతులకళేబరములనుండి వెడలురక్తప్రవాహములచే యుద్ధభూమి సంజకెంజాయఁగప్పిన గగనతలంబుమాడ్కిఁ గన్పట్టఁజొచ్చెను. తెగిన మొండెములును, ద్రొల్లిన శిరంబులును, చెదరినహస్తపాదశకలంబులును, మిగుల భీకరముగ నాహవభూమిం గప్పియుండి కాకఘూకముల విందునకుఁ బిలువఁ దొడంగెను. కడప్రాణములతో నేలపై వ్రాలినవారి మరణవేదనలు చల్లారి జీవసంచలనము శూన్యమైనటులు వెల్లడిసేయుచుండెను.

మృత్యుముఖమునుండి బయల్పడినసుందరి కిరాతులనుండి తప్పించుకొనుసమయము చిక్కినతోడనె మంటపమునకు దూరముగనున్నపొదల మాటున డాఁగి సమరలీలలు చూచుచుండెను. శత్రునాశనమైనతోడనే బెబ్బులిపోయినపిమ్మట నికుంజమువెలువడివచ్చు హరిణివలె నామె మెల్లమెల్లన ధనుర్ధరులవైపున కడుగులిడఁజొచ్చెను. అశ్వికులును దాముకాచినయాయువతిరత్నముయొక్క చరిత్రమును దెలిసికొనుటకుఁగాఁబోలును హయములడిగ్గి సుందరివైపునకు నడచిరి. వారు సమీపించినతోడనే యవ్వేలఁది వారిపాదములపైఁబడి "మహాశయులారా! మీపుణ్యమున బెబ్బులినోటినుండి వెలువడితిని." అనుచుఁ బొరలిపొరలివచ్చుదుఃఖ మాపికొనఁజాలక కన్నీరుమున్నీరై వెల్లువగట్ట నోటమాటరాక మిన్నకుండెను. సాహససింహుఁ డాయబలను లేవనెత్తి "అమ్మా! నిన్ను మ్రింగఁబోయిన పెనురక్కసులు హతులైరి. ఇఁక నిసుమంతయు భయములేదు. అరిభయంకరుఁ డీసంగరసింహుఁడు నీకు సేన మొసంగుచుండ భయపడ నిమిత్తములేదు." అనియెను.

సంగర — ఈశ్వరేచ్ఛవలన మీకార్యము నెఱవేర్పఁగలిగితిమి. నీవిఁక గంటఁదడి పెట్టవలసిన యవసరములేదు.

సుందరి — (దుఃఖము నడఁగమ్రింగి గద్గదస్వరముతో) “వీరసింహులీయెడకు సహాయులై ప్రాణదానమొసంగిరని సంతసించుచుంటిని. మీభటులసేవలు నాసౌఖ్యమును రక్షించుచుండ, ఎందఱో పరిచారికలు నా కూడిగములుసలుపుచుండ, సమస్తవిభవంబులనోలలాడు నాకిట్టి యడవి నీచరాతులచేఁ బడి యీకాళికి బలిపశువునగునంతటి దురవస్థను లోనుగావలసి వచ్చెనను తలంపున నుప్పొంగినదుఃఖమాపుకొనఁజాలనైతిని.” అనియెను.

సాహ — వల్లీ! నీ వేభూపాలవంశము నలంకరింపఁజేసితివి? ఏమహీపాలుని జెట్టఁబట్టితివి?

సుంద — మహదైశ్వర్యసంపన్నుఁడగు ఢిల్లీశ్వరుని గాఢానురాగమున కనుకూలలగు సేవకురాండ్రలో నేనొక్కదానను. శైశవమున నాతలిదండ్రులు స్వర్గస్థులగుటనో, పేదయుండుటనో, యెక్కడో దిక్కుమాలియేడ్చుచుండ, ఢిల్లీశ్వరుని సేవకులు గొనితెచ్చి రాజనగరున నన్నుఁ బెంచిరి.

సంగర — ఓహో! సాహసిసింహా! ఢిల్లీశ్వరునిమహిషీరత్నమును గాచుటలో మనవిలువిద్య నుపయోగింపఁగలిగితిమి.

సాహ — మిత్రమా! ఢిల్లీనగరాభిముఖులమై మనము బయలుదేఱిన కార్యమున కియ్యది శుభసూచకముసుమా!

(తనప్రాణరక్షకులు కార్యార్థులై ఢిల్లీనగరమునకుఁబోవుచున్నారని వినునంత నవ్విలాసిని యిట్లువిన్నవించెను.)

“అత్యద్భుతశరవిద్యాకుశలులగు వీరాగ్రగణ్యులు ఢిల్లీనగరమున నెట్టి కార్యమందైన సఫలీకృతమనోరథులగుట సులభసాధ్యము. ఐనను మీవలనఁ బునర్జీవముఁగాంచి సర్వవిధముల మాకు ఋణపడియున్న యీ

యబల యుతభక్తికి మీయత్నములో నిసుమంతయవకాశమిచ్చుటకుఁ గుసుమమంజరి వేఁడుకొనుచున్నది."

సంగ—ఢిల్లీశ్వరరాజ్ఞీ! రాజపుత్త్రులయెడ నీభర్తయొక్క మహమ్మదుశాయి మిగులహితవర్తియై స్నేహానుబంధముఁ దనయెడ వారివిశ్వాసమును బలపఱుచుకొనుచున్నాఁడు. రాజపుత్త్రసంతతిజులమైన మేము పాదుషారాజ్ఞికిఁజేసిన యీస్వల్పసాహాయ్యము ధనుర్ధరుఁడునెఱపవలసినధర్మమేకాని పొగడ్తకుఁదగిన మహోపకారముకాదు.

సాహససింహుఁడు సంగరసింహుని సమీపించి రహస్యముగ "మిత్త్రమా! ఇవ్వారవిలాసిని తన యసమానతనూవిలాసమున ఢిల్లీశ్వరుని గాఢానురాగమున కాస్పదురాలై యాతనివశంవదునిగ నొనరించుకొని యుండును. ఈమె మనకార్యమున కెంతయు సహాయభూతురాలగునని తలంచెద. మాళవరాజ్యమును నీవు గైకొనుటకు సందియములేదు." అని హితునిమనంబున కుత్సాహము నెలకొల్పి "పాదుషారాజ్ఞీ! నీదురూపలావణ్యమహిమచే భారతరాజధానిలో మహోన్నతపదవి నందఁగలిగితివి. కుసుమమంజరియను నీమంజులనామము వినినంతనే ఢిల్లీప్రజలలో నెవ్వారునీకుఁగింకరులుకాకుందురు? కావలసినప్పుడు నాప్రియమిత్త్రునికార్యసాఫల్యమున నీసాహాయ్య ముపయుక్తపడునట్లు—

అనిసగమువచించుసరికిఁ గుసుమమంజరి కాళియధిష్ఠించియున్న మండపమువైపునకుఁ జూడ్కి నిల్పి "అమ్మయో!" యని కేకవేసి మూర్ఛావేశమునఁ బ్రక్కకు వ్రాలఁజొచ్చెను. సంగరసింహుఁ డామె నేలఁబడకుండ హస్తముల సాహాయ్యమొసంగి "ఏమి? యీభయకారణము?" అనియెను. సాహససింహుఁడు నలుదెసలఁ బరికించి "భయహేతువు పొడగానరాకున్నది. పరాకుగ నీవుముందున కడుగిడితివి. పరపురుషులముగాన ఢిల్లీశ్వరరాజ్ఞి భీతిల్లియుండును. నీసచ్చరిత్ర మామెకెట్లువిదితమగును?" అనియెను.

సంగర—సామ్రాజ్ఞీ! అక్బరుచక్రవర్తి యావద్రాజపుత్రులకు డిల్లీశ్వరులకు బావమఱదులనునది యెఱుంగవా? సతీమణీ! నీయెడ సోదరభావంబున మెలంగెదను నన్ను నీసోదరునిగఁ దలంపుము.

అంతఁ గుసుమమంజరి మూర్ఛఁదేరి "నయశీలులారా! మీవలన నాకణుమాత్రమును భయము జనింపలేదు. మిమ్ముఁ జూచినదాదిగ నన్ను సంరక్షింప మనుష్యరూపముఁ దాల్చిన వేల్పు లనుకొనుచుంటినిగాని వేఱుభావములేదు. మండపసమీపమున బాణహతిచే నేలవ్రాలిన యిర్వురుకిరాతులు మాయమగుటను జూచినతోడనే భీతిఁజెందితిని." అనియెను.

సంగర—ఆయిర్వురు మరల మరలఁ జెనకుదురనియా?

కుసుమ—వీరరత్నమా! అంతమాత్రమున కధైర్యపడినదానను గాను. నన్నిచ్చటికిఁ గొనివచ్చినది నల్వురుకిరాతులేయైనను నందొక్కఁడు కాళీవిగ్రహము వెనుకతట్టునకుఁ బోయి తిరిగివచ్చునంతలో మఱి పదియార్గురు బిలబిలలాడుచు నచ్చోటినుండివచ్చిరి. మీబాణహతిఁ జెందియు మరల సజీవులై తప్పించుకొనిపోయిన యిరువురుకిరాతులును మరలఁ గాళీవిగ్రహము వెనుకకే పరుగెత్తిరి. ఇవ్వనమంతయు వారుబాగుగ నెఱింగినవారు. ఎచ్చటెచ్చట వారిసహచరు లెందఱెందఱున్నారో తెలియరాదు. 'అనలశేషము శత్రుశేషము నుపేక్షింపరాదని పెద్దలు చెప్పుదురు.

సంగర—అట్లైనఁ గాళికివెనుకవైపున వీరిరహస్యనివాసస్థాన ముండవచ్చును. సాహససింహా! వారిని వెదకి రాణిభయమును మునుముందుఁ దొలఁగించు టుచితము.

ఆయువతివెంటరా నావీరులు మండపమువెనుకకుఁ జనిరి. అచ్చట నొక వనవృక్షము శాఖోపశాఖలతో నాకసమంటుచు నలుదెసల నిరులు గొల్పుచు నావీరుల కద్భుతంబును గుసుమమంజరికి భయంబును జనింపఁ జేసెను. దాని స్కంధవలయ మతివిస్తీర్ణమై విస్మయజనకమగుచుండెను. దీని కిరుప్రక్కల సుధామయమకుట్యములంబోలె ఘనశిలాప్రాంతభాగములు

# ద్రౌపదీదేవి చరిత్రము.

మనము నివసించుచున్న యీభరతఖండమున గల యనేక దేశములలో నొకటియై యనేక నదులు ప్రవహించుటచేత సారవంతమై ఫలవంతమై వెలయు పాంచాలదేశము ప్రస్తుతకాలమునందున లేని దేశభక్తులచేతను ధర్మాత్ములచేతను సత్యనిరతులచేతను భారతయుద్ధకాలమునను చాల ప్రసిద్ధిగాంచి యుండెను. ఆకాలమున కాంపిల్యనగరము రాజధానిగా ద్రుపదుడను నొక మహారాజు ప్రజారంజకముగాను ప్రజానుమతముగాను పరిపాలనచేయుచుండెను. ద్రుపదమహారాజు పరాక్రమవంతుడు. మరియాదగలవాడు. ఆకాలపురాజులలో గొప్పవారిలో నొకడై గణుతికెక్కి యుండెను.

మహారాజైన తరువాత సంపదలకేమి కొదువ? సౌఖ్యమునకేమి తక్కువ? ఆవిషయమున చెప్పనక్కరయే లేదుకాని యెంతవారికైనను నీశ్వరానుగ్రహము లేనియెడల సుఖముండదు. సంతోషముండదు. ఎల్లభాగ్యములు కొల్లలుగాగల యారాజునకు సంతానభాగ్యము లేదు. ఎన్నివైభవములున్నను కన్నబిడ్డలు లేనివాడు శోభించదుకదా! ద్రుపదుని రాణి పేరు కోకిలాదేవి. ఆమె యతిబుద్ధిమంతురాలు. పతివ్రత. పతిపదచింతతోడకూడ నాయిల్లాలికి సంతానచింతకూడ నధికమయ్యెను. భార్యావిచారము చూచినను సరిసాటివారి బిడ్డలను చూచినను ద్రుపదుని చిత్తముకూడ విచారమగ్నమగుచుండెను.

పిమ్మట రాజదంపతులు పురోహితుని యనుమతివల్లను పండితుల యాజ్ఞవల్లను బంధువుల కోరికవల్లను పుత్రకాంక్ష ప్రేరేచుటవల్లను పుత్రకామేష్టి యను యాగము నొకదాని నతినిష్ఠతోను యథావిధిగాను చేసెను. తదనంతరమున నొక పుత్రుడును పుత్రికయు వారికి కలిగిరి. పుత్రునకు ధృష్టద్యుమ్నుడనియు పుత్రికకు కృష్ణయనియు నామములుంచిరి. ద్రుపదుని కూతురగుటచే ద్రౌపదియనియు యజ్ఞమువలన నుద్భవించుటచే యాజ్ఞసేనియనియు పాంచాలరాజకుమారికయగుటచేత పాంచాలియనియు కృష్ణకు పేరులు వచ్చెను. ఈచరిత్రమునకు నాయిక యాద్రౌపదియే యని చదువరు లెఱింగియే యుందురు.

ధృష్టద్యుమ్నుడు పరాక్రమవంతుడై ధనుర్విద్య మొదలగు విద్యలనెల్ల నభ్యసించుచుండెను. ద్రౌపదియు నన్నతో సమముగా సకలవిద్యలను గ్రహించుచుండెను. ఆ చిన్నది బహుబుద్ధిమంతురాలు. గుణవతి. సౌందర్యవతి. ఆమె తనరూపగుణసంపదలచే తనను కన్నవారిని నానందపరుచుచుండెను. ఆమెనువిన్న రాకుమారులెల్ల తమకు భార్యయైన బాగుండునని తలంచి యువ్విళ్ళూరుచుండిరి. క్రమముగా నామెకు నెల్లవిద్యలతోడను యౌవనము కూడ వచ్చెను. ఆమె రూపముద్విగుణమయ్యెను. వినయము నయము మొదలగు సుగుణపుంజమును హెచ్చెను. కోకిలయు ద్రుపదుడును కుమార్తె వివాహము నిమిత్తమై యాలోచింపసాగిరి. ద్రుపదుడు ధాత్రినంతుడు. రాజకులభూషణుడు. యోధాగ్రేసరుడు. కోకిలమ్మయు గుణవంతురాలు. మంచియాలోచన గలది. అందువల్ల నిరువురును చాల నాలోచించి యుత్తమక్షత్రియ పుత్రుడై వీరాధివీరుడైన రాకుమారునకిచ్చి వివాహముచేయవలయునని నిశ్చయించిరి.

అంతకు పూర్వమే యొకనాడు పాండవులలో నొకడైన యర్జునుండు గురుని యానతి చొప్పున ద్రుపదునిమీదికి దండెత్తివచ్చి యాతని నోడించి పరాభవపరచెను. ఆసమయమున ద్రుపదునకు నర్జునునిశక్తియు శౌర్యమును బాహుబలమును బుద్ధికుశలతయు తేటతెల్లములయ్యెను. ద్రుపదుడు పార్థుని పరాక్రమమును చవిచూచిననాటనుండియు నాశ్చర్యమునొందుచు నతనియందు వైరము కలిగియుండుటకు మారుగా ప్రేమకలిగి యుండెను. అర్జునునిగుణము లనేకపర్యాయములు భార్యవద్దను మిత్రులవద్దను పొగడుచు ముచ్చటపడుచుండెను. యోగ్యులగువారికి లక్షణమిదియే కదా! ధనంజయుని విజయవిశేషంబులు వినుచున్నకొలందిని కోకిలాంబకును నతనికే తనకూతు నీయవలయునని కోరిక లుదయించుచుండెను. ద్రౌపదియు నట్టిజగజెట్టి తన్ను చేపట్టుభాగ్యము కలుగునాయని యువ్విళులూరుచుండెను. ధృష్టద్యుమ్నునకును నిదియే యిష్టముగా నుండెను. కాని యది నెరవేరక వారిమనంబులకు వ్యాకులము కలిగెను.

ఇప్పుడు ఢిల్లీయని పిలువబడు హస్తినాపురమును కురువంశరాజు లాకాలమున పాలించుచుండిరి. ఆరాజ్యమున కధికారియగు ధృతరాష్ట్రమహారాజునకు పాండురాజు విదురుడు ననుసోదరు లిరువురు కలరు. ధృతరాష్ట్రుని భార్యపేరు గాంధారీదేవి. ఆమె మహాపతివ్రత. ఆదంపతులకు దుర్యోధనాదులు నూరుగురు కుమారులును దుస్సలయను కూతురును గలిగిరి. పాండురాజునకు కుంతి, మాద్రి యను నిద్దరు భార్యలు. కుంతి

యందు ధర్మరాజు, భీముడు, అర్జునుడు నను ముగ్గురు పుత్రులును మాద్రియందు నకులుడు, సహదేవుడు నను కవలపిల్లలిద్దరును పాండురాజున కైదుగురు బిడ్డలుండిరి. పాండురాజు మరణించెను. మాద్రి సహగమనము చేసెను. కుంతి బిడ్డలను పోషించుటకయి బ్రతికియుండెను. పాండురాజపుత్రుల నందరిని పాండవులనియు ధృతరాష్ట్రపుత్రులను కౌరవులనియు వాడుచుందురు. కౌరవులు బలము, పరాక్రమము, సాహసము మొదలగు గుణములు కలవారైనను నీతి, న్యాయము, ధర్మము, దయ, సత్యము, మొదలగు గుణములు లేనివారు. పాండవులకు బలపరాక్రమాదులకు తగినట్లు సత్యశౌచములు, నీతిన్యాయములు, దయాధర్మములు, శాంతౌదార్యములు గలవు. లోకము మంచివారిని ప్రేమించుటయు చెడ్డవారి నసహ్యించుటయు సహజముకదా! ఎల్లరును పాండవులు సద్ధర్ములని వారిమేలు కోరుచుందురు. ధనద్రవ్యముల కపేక్షించువారును నుపకారముల కోరువారును మాత్రము కౌరవుల మైత్రిని చేయుచుందురు. దుర్యోధనుడు మొదలగు తనపుత్రులకన్న ధర్మరాజు బుద్ధిమంతుడనియు తగినవాడనియు యోచించి ధృతరాష్ట్రు డతనిని యువరాజుగజేసి తండ్రిలేని లోటులేకుండ పాండవుల నాదరించుచుండెను.

దుర్యోధనునకు ధర్మరాజు యువరాజగుట యెంతమాత్రము నిష్టములేకుండెను. కౌరవులందరును నొకటే యాలోచన కలవారైరి. వారందరును క్రూరులే కావున పాండవుల నేయుపాయముచేతనైన వంచించి పరాభవించుటయేకాక రహస్యముగ చంపించుటనుకూడ ప్రయత్నము చేయుచుండిరి. అయినను పాండవులు పరాక్రమముచేతను బలముచేతను బుద్ధిచేతను నీతులనను కూడ కౌరవులకన్న నధికులు కనుక వారి మాయోపాయములచే చిక్కక తప్పించుకొనుచుండిరి. దుర్యోధనుడు తండ్రితో మొరపెట్టుకొని పాండవులు హస్తినాపురమున నుండకుండ వారణావతమున కంపునట్లు చేసెను. కౌరవులున్నచోటనే పాండవులున్నయెడల వారి బుద్ధివిశేషములకును బలపరాక్రమములకును వీరు చాలనివారగుటచే లోకులీసంగతి నెఱింగిన తమకు గౌరవము రాదని యూహించి దుర్యోధను డిట్లుచేసెను.

అంతటితో సుయోధనుని యీర్ష్యతగ్గలేదు. పాండవుల మరణముకోరి యాత డెన్నియో యుపాయములను పన్నుచుండెను. పాండవులుండుటకు వింతయైన లక్కయింటి నొకదానిని కట్టించి వారితో కపటస్నేహమును చేయుచు వారందు కాపురము చేయుచుండగా నొకనాడు రాత్రివేళ దానికి నిప్పుపెట్టించెను. ధర్మమును నమ్మియున్న

పాండవులను దైవము చెయుమనా! ఈశ్వరకృపవల్ల పాండవులా యగ్నియాపదనుండి తప్పించుకొని యెక్కడికో పోయిరి. పాండవులు చచ్చిరనుకొని కౌరవులు సంతోషించిరి. పాండవుల స్నేహితులును వారి క్షేమముకోరు ప్రజలును విచారించిరి.

ద్రుపదమహారాజు కోరిక నెరవేరక పోవుటకిదియే కారణము. పాండవులా గృహమునంబడి కాలిపోయి మృతినొందిరని యతండును తలంచెను. అర్జునుండు పరాక్రమోపార్జనుండు మడియుటకతండు మిగుల చింతించెను. అయినను ద్రౌపదిని విజయునకు పెండ్లిచేయుటకు ప్రాప్తము లేకపోయినను నంతవానికైన నిచ్చి సంతోషింపవలయునని యెంచెను. అంతటి పరాక్రమవంతులగు క్షత్రియపుత్రకులు బలహీనులవలెను బుద్ధిహీనులవలెను నట్టి యింటిమంటలలో తగులుకొని చచ్చియుందురాయని సంశయము ద్రౌపదికి కలిగెను. ' ఆమె మనోధైర్యమును బట్టి యర్జునుండు బ్రతికియే క్షేమముగా నున్నాడనియు కౌరవుల బాధలు పడలేక ప్రచ్ఛన్నముగ నెందేని నుండురనియు నర్జునుండు తప్పక యెప్పటికైన బయలుపడకమానడనియు ద్రౌపది గట్టిగా నమ్మియుండెను. కాని యతడు తనంత బయలు పడుట కుపాయమేమని యోచించుచుండెను.

పాంచాలుడు పార్థునకు విలువిద్యయందెక్కువ నేర్పు కలిగియుండుటచేత విలువిద్య యందు నేర్పుగలవానికే తనకూతునీయ నిష్టముండెను. కావున మత్స్యయంత్ర మొకదానిని చేయించి దానిని త్రుంచినవానికి కన్యనిచ్చెదనని స్వయంవరము చాటించెను. ఆయంత్రము పాండవ మధ్యముండగు నర్జునుండుగాని యంతవాడుగాని దునుమవలయు గాని యితరులకు సాధ్యము కానేరదు. ఈయుపాయమున నర్జునుండెచ్చటనున్నను రావచ్చునని ద్రౌపది సంతసించుచుండెను.

స్వయంవరమునకు రాజకుమారులందరును వచ్చియుండిరి. వారినందరిని విశాలమగు నొకప్రదేశమున సభచేయించి ద్రుపదమహారాజు వారిముందర నొక పొడుగుపాటి స్తంభమును పాతించెను. దానిచివరను చేపరూపుగల యంత్రమొకటి కట్టబడియుండెను. అకాశము నంటియున్నట్లుండి నక్షత్రమువలె మినుకుమినుకు మనుచు చేపవలె తిరుగుచున్న యాయంత్రము చూచుటవలననే రాజకుమారుల దృష్టి మిరుమిట్లుకొని యుండెను. ఆసమయమున ద్రౌపది జగన్మోహినివలె శృంగారించుకొని చేతపూలమాలిక ధరించి వారియెదుటికి వచ్చి నిలిచియుండ వారిచూపులామెపైకి వ్రాలి

మరింత మిరుమిట్లు గొనుచుండెను. అర్జునుండు వచ్చియున్నాడేమోయని వచ్చిన రాజకుమారుల యందలి రూపలక్షణాదులను పరికించుచు ద్రౌపది నిలిచియుండెను.

ఆసమయమున పాంచాలి యన్నయగు ధృష్టద్యుమ్నుడచ్చటికి వచ్చి యిట్లు పలికెను. నృపాలవరులారా! ఈమీనయంత్రము నీవిండ్లను నమ్ములనుగొని యెవరు కొట్టెదరో వారికీసుగుణవతియగు మా చెలియలిని పత్నిగా నొసంగుచున్నారము. ఒక్కొకరైదేసిసారులు బాణము వేయవచ్చును. అని చెప్పి యొక్కచో కూరుచుండెను. ఈస్వయంవరమునకు దుర్యోధనుడు బంధువులతోడను స్నేహితులతోడను కూడవచ్చెను. శ్రీకృష్ణుడు తనసోదరులతో చూడవచ్చెను. లెక్కన రాజకుమారులనేకులు వచ్చిరి. కొందరు బ్రాహ్మణులును వచ్చిరి. కాని యెవ్వరును నాయంత్రమును నరకుట తమకు సాధ్యము కాదనియును పరాభవము గలుగుననియు తలంపరైరో లేక బొత్తిగా నూరకుండుటే యెక్కువపరాభవమని తలంచిరో కాని యొక్కరొక్కరే తమతమ చాకచక్యమును ధనుర్విద్యాకౌశలమును చూపి సభ్యులు నవ్వుచు పరిహసింప చిన్నబుచ్చుకొని తలలు వంచుకొని తమతమ యాసనములపై గూర్చుండిరి. అంతనిది యీబడుగులకు సాధ్యమగునా! యేమీ! వీరిసాహసము! అని యందరు మాచుచుండ నొక బ్రాహ్మణుడు వచ్చి సులభముగా నావిల్లు మోపెట్టి యవలీలగా యంత్రమును కొట్టి విజయుడయ్యెను. సభ్యులాశ్చర్యమున కరతాళములు వాయించిరి. ఈవిజయుడే విజయుడని ద్రౌపది సంతసించుచు నతని మెడను పూలమాలిక వేసెను. అతనిమీద బ్రాహ్మణులును ముత్తైదువులును ధనుర్ధరులును సంతోషముతో విరుల వానలు కురియించిరి.

ద్రౌపది రూపమును చూచి మోహముకలిగి యామె తమకు లభించునేమోయని యాశజెందియు తుదకు స్వార్థమనోరథులై కౌరవులును కొందరు రాజకుమారులును ద్రౌపదిని చేకొన్న బ్రాహ్మణకుమారునిపై నసూయవహించిరి. ఆయసూయ క్రమముగా కోపముగామారి ద్రుపదునిమీదికి ప్రసరించెను. స్వయంవరమునకు రమ్మనిపిలిచి రాజపుత్రులలో నెవ్వరికిని తనకూతురినీయక విప్రునకిచ్చి యందరిని పరాభవించినాడని ద్రుపదునిపై నెపము పన్ని యాతనిపైని యుద్ధమునకు సిద్ధులైరి. ఆసమయమున మీనయంత్రము నేసిన బ్రాహ్మణుడు తనయన్న నొకనింగలసి ద్రుపదునకు సాయమై యారాజలోకమునెల్ల నోడించి సంతోషము కూర్చి ద్రౌపదిని దోడ్కొని తమ విడిదిపట్టున కరిగెను.

ఆవిడిదియందా విప్రకుమారులకొక యన్నయు నిరువురు తమ్ములును తల్లియు నుండిరి. అప్పుడా బ్రాహ్మణులు కాలవశమున బీదలై యుండుటంజేసి యదివరకు భిక్షాన్నమును కొని తెచ్చి తల్లిముందర బెట్టుచుండిరి. కావున నాటిదినమున తమకులభించిన స్త్రీరత్నమే భిక్షమని భావించి తల్లియొద్దికిపోయి తల్లీ! నేడు మనయదృష్టవశమున మాకు గొప్ప భిక్షము దొరికినది యిదుగో చూడుమని చెప్పిరి. కార్యాంతర ప్రసక్తచిత్తురాలైయున్న యాబ్రాహ్మణభామిని నాడు పుత్రులు కొనివచ్చిన దేదియో యొక యపూర్వమైన భక్ష్యమేమోయని యూహించి ద్రౌపదిని చూడకయే బిడ్డలారా! దానిని మీరైదుగురును సమముగా ననుభవింపుడని యాజ్ఞ యిచ్చెను.

ఆమాట వినినతోడనే బ్రాహ్మణ బాలకులైదుగురును తెల్లబోయిరి. అదివరకు వీరెన్నడును తల్లిమాట కడుగుదాటి యెఱుగరు. మాతృదేవతను దేవతలలో నుత్తమ దేవతగా నెంచి భయభక్తులతో పూజించుచుండువారు. ఇప్పుడు తెచ్చిన భిక్షము స్త్రీరత్నముగాని భక్ష్యముగాదు. అయిదుగురును ననుభవించిన యెడల లోకమునకువ్యతిరేకమై విడ్డూరముగా కన్పట్టును. లోకులు నిందింతురు. పెద్దలు దూషింతురు. లేదా తల్లి యాజ్ఞ తప్పవలయును. ఇట్లని యాసోదరపంచకము చింతిల్లుచుండెను. ఈసంగతి తెలిసికొని వారితల్లియు చాల తనతత్తరమునకు పశ్చాత్తాపపడి చింతించెను. కన్యను కొనివచ్చిన సోదరులిరువురును తాము తెచ్చిన భిక్షమిట్టిదని తల్లితో వివరముగా చెప్పక సందిగ్ధముగా చెప్పుటచే నింత వచ్చినదని తమ్ము నిందించుకొనిరి.

అంత నాకన్యను సంపాదించినవాడే పెండ్లియాడుట యుచితమని కొందరనిరి. పెద్దవారు పెండ్లికాకయుండ చిన్నవాడు సమ్మతింపననెను. ఇదిగాక ద్రౌపది రూపమును చూచినతోడనే యామెయందందరికిని భ్రమ జనించినది. తల్లి యాజ్ఞయు నట్లున్నది కావున నైదుగురును ద్రౌపదిని పెండ్లియాడుటకు నిశ్చయించుకొనిరి. అప్పటినుండియు ద్రౌపది వారినైదుగురిని సమముగా ప్రేమించుచు భక్తిగలిగి సేవించుచు నత్తనాదరించుచు పతులు తెచ్చిన భిక్షాన్నము వారికి ముందుగపెట్టి పిమ్మట నత్తకిడి మిగిలినది తాను సంతోషముతో భుజియించుచుండెను. కాని నిరుపేదలు తనకు భర్తలైరని యామె యేమియు విచారించలేదు.

యోగ్యురాలగు నత్తయు నుత్తములును బలశౌర్యవిరాజితులగు పతులును లభించి నందులకు సంతసమునే పొందుచుండెను. ద్రుపదమహారాజు మాత్రము తనకోరిక

వ్యతిరేకముగా పండి తనకూరిమికూతురు బీదవారలకుభార్యగా కష్టపడ చుండుటయు తనకు బ్రాహ్మణు లల్లుండ్రగుటయు గని మిగుల చింతించుచుండెను. కాని యంతటి పరాక్రమవంతులును క్షాత్రయుక్తులును బీదబ్రాహ్మణకులమునందుదయించుట యరుదు గదా యనిమాత్రము తలచుచుండెను. తరువాత ద్రుపదుడుచితమర్యాదలతో బ్రాహ్మణ కుమారులను తల్లిని తనకుమార్తెను నగరునకు పిలిపించెను. ఆనాడు ద్రుపదుడు వారలను చూచి పూజ్యులారా! మీరలెవ్వరో మీవృత్తాంతమేమియో సాంతముగా తెలుపవలయు నని కోరెను.

ఆబ్రాహ్మణవేషధారులలో ప్రథముడిట్లు ప్రత్యుత్తరము నిచ్చెను. రాజోత్తమా! మేము క్షత్రియులము. పాండురాజ పుత్రులము. నా పేరు ధర్మరాజు. మత్స్య యంత్రమును గొట్టిన యతడర్జునుడు. అతనికి రణరంగమున సాయముచేసినవాడు భీముడు. వీరలిరువురును మాతమ్ములు నకులసహదేవులు. అస్మద్జనని మాతల్లియగు కుంతి. మేమందరమును నీశ్వరానుగ్రహము కలిమి లక్కయింట మడియకుండ బ్రతికి యిట్లు ప్రచ్ఛన్నవేషులమై యున్నారము. అని చెప్పెను.

అంత ద్రుపదుని కుటుంబమంతయు రాజబంధుమిత్రబృందములును నందరును నాశ్చర్యసంతోషములలో నోలలాడిరి. ద్రౌపది సంతోషమునకు మేరలేనేలేదు. పాండవులులక్కయింటబడి నిష్కారణముగా చావకుండ బ్రతికి బయలుబడుట కందరును సంతోషించుటయేగాక మాయదారులగు కౌరవుల బారినుండి వారేదారిని తప్పించుకొని వచ్చిరో యని తెలిసికొనుటకు కుతూహలముతోనుండి యావృత్తాంతము చెప్పుమని యడిగిరి. ధర్మరాజు వినువారికబ్బురముగా నిట్లు చెప్పెను.

మేము హస్తినాపురమునుండి వారణావతమునకరిగినది మొదలుగా న్యాయశీలుడును ధర్మపరుడునునగు విదురుడు మాయందలి దయచే నచ్చటి విశేషముల నెప్పటి కప్పుడు మాకు తెలియపరుచుచుండెను. దుర్యోధనుడు చేసిన దురాలోచనమంతయు తెలిసికొని యొక యుప్పరవానిని పిలిపించి మావద్దకు పంపించెను. వాడువచ్చి పరమ రహస్యముగా మాతోనిట్లు చెప్పెను. అయ్యలారా! మీపినతండ్రియగు విదురునకు నేను నమ్మిన సేవకుడను. అతడు మీకొక సంగతిని తెలిపిరమ్మని నన్ను పంపెను. మీరలిది సావధానముగ విని చక్కగా నాలోచించి జాగ్రత్తగా నాచరింపవలయును. దుర్మార్గుడగు దుర్యోధనుడు రానున్న కృష్ణచతుర్దశినాటి రాత్రి నిశీథమున లక్కయింటి

కినిప్పంటించి మిమ్ములనెల్లరను నశియింపజేయ నిశ్చయించుకొని యున్నాడు. పరుల కెవ్వరికిని తెలియకుండ మీ మేడలోనుండి కడుదూరమువరకు భూమిలోని కొక సొరంగమును త్రవ్వెదను. ఆనాడుపొద్దు గ్రుంకినతోడనే మీరీగృహమును విడిచి యీసొరంగముగుండ నవ్వలికి పొండు. అని చెప్పెను.

మేము వానిచే బిలమును త్రవ్వించితిమి. పిదప చతుర్దశినాడు రాత్రి కౌరవులచే పంపబడిన వారెవ్వరును నిప్పు ముట్టింపకమున్నె భీముడాలక్కయింటి కగ్గినంటించి మమ్మెల్లర నాబిలముద్వారమున నొకసురక్షితమైన ప్రదేశమున చేర్చెను. అంత మే మందరము బ్రాహ్మణవేషములను ధరించి యేకచక్రపురమున భిక్షాన్నవృత్తి నిజీవించుచుంటిమి. ఆపురజనులను హింసించుచుండు బకాసురుడను క్రూరరాక్షసుని సంహరించినవాడు బలశాలియగు నీభీమసేనుడే. కౌరవులచే మాగుట్టుమట్టెల్ల దెలిసికొనివచ్చుచుండుమని పంపుగా వచ్చి మాయింట సేవసేయించుచున్న యొకనీచురాలగుదాసియు దానిబిడ్డలైదుగురును లక్కయింటబడి యగ్నికాహుతులైపోయిరి. వారి కళేబరములను చూచిన పురజనులు మేమందు మడిసితి మనుకొని విచారించిరి. కౌరవులు సంతసించిరి. ఏకచక్రపురమునుండియే యిక్కడి స్వయంవరము వార్త విని వచ్చితిమి. అని యంతయు నెఱింగించెను.

తరువాత ద్రుపదమహారాజు పాండవులైదుగురికి ద్రౌపది నిచ్చి పెండ్లిచేసిన బంధువులును లోకులును నాక్షేపింతురను భయమున నొప్పుకొనజాలకుండెను. అంతట కుంతియు ధర్మరాజును వ్యాసమహర్షిని పిలిపించి యాతపోధనునిచే నది ధర్మసమ్మతమని చెప్పించి ద్రుపదరాజు నొప్పించి యందరిచేతను మెప్పింపబడెను. అనంతరమున నతివైభవముగా ద్రుపదుని పురమలంకరింపబడి ద్రౌపదీ పాండవులకు పరిణయోత్సవములు జరుపబడెను. పెండ్లికి శ్రీకృష్ణాది బంధువులును మిత్రులును వచ్చిరి. పాండవుల కందరకును ద్రుపదుడనేక గజాశ్వరథాదులును రత్నభూషణ కాంచనచేలాదులను నరణముగా నొసంగెను. సుగుణభూషితురాలును సుందరీలలామయునగు ద్రౌపదిని పంచపాండవులును పంచప్రాణములవలె చూచుకొనుచు ననుపమానానురాగముకలిగి వర్తిల్లుచు నామె నెంతయు నానందభరితహృదయురాలిం జేయుచుండిరి. ద్రౌపదియు పతులను దైవతములవలె నిర్మలభక్తితో పూజించుచుండెను.

# న్యాయవాదివిలాసము.

రంగము—నవనాగరికపురము. రాయసం రంగయ్యగారియిల్లు.

[రంగయ్యగారు సావిడిలో కూర్చునియుండగా ముష్టిమృత్యుంజయశాస్త్రి గారీక్రిందిశ్లోకము చదువుచు ప్రవేశించుచున్నారు.]

శ్లో॥ తండులాని గృహమందునసన్తి। తిండికైతే పదిమందివసన్తి।
రండనాకొడుకులెల్ల వసంతి। ముండమోపులుపడైతే హసంతి॥

రంగ—శాస్త్రిగారూ! నమస్కారము! దయచేయండి! ఏమిటో వికటకవనము చెప్పుచున్నారు.

మృత్యు—ఏముందండి పంతులుగారూ! నాఅవస్థకనుగుణ్యాముగానే కవనముకూడా వస్తూవుంచుంది! ఇంట్లో తండులాల్లేవు! తిండికి కావలసినంతమంది యున్నారు. సుపుత్రులు పుట్టినారు. అంతా పండితపుత్రులే! వీళ్ళనుచూస్తే ముండమోపులంతా నవ్వుతూయున్నారు. ఇంట్లో వస్తువ దీసికొనివెళ్లి వీధిలో పెట్టేవాళ్ళేకాని వీధిలోకివెళ్ళి ఒకతృణమైన యింటికి తెచ్చేవాళ్ళులేరు.

రంగ—మీరెప్పుడు బీదార్పులే అరుస్తూవుంటారు. ఇదివరకేమన్నా సరిపోయిందికాని యిక నిట్లాంటిమాటలంటె యెవరూ సహించరు. మీరు చాలా అదృష్టవంతులు! మీపెద్దకుమార్డు బి. యల్. పరిక్ష ప్యాసుఅయినాడుకదా! ఇక మీకేమిలోటు.

మృత్యు—ఆ! ధనధాన్యసమృద్ధి! ఇదివరకు ఒకచేతితోనే తించూవున్నాము. ఇకను రెండుచేతులాతించాము. నేను పంచకావ్యములు చదివినాను, శ్రౌతస్మార్తకర్మలు చేయిస్తాను. పితృమేధములో నాతోసమాన

మైనచేయి యీనాటువనేలేదు. నాకుమార్డు పెద్దపరీక్షలు ప్యాసుఅయినాడు. ఇంటిలోనుంచి కదలడు. ఎవ్వరిని అడిగి ఏమిాతీసుకొనిరాలేడు. అన్నింటికి నేనేయేడవాలి. మావాడితో ప్యాసైనవాళ్ళంతా ఉద్యోగాల్లో ప్రవేశించినారు. హాయిగా సంపాదించుకు తింటూవున్నారు.

రంగ—మీాఅబ్బాయిని సర్కారుఉద్యోగంలోనికి పంపుతారా? ప్లీడరీలో ప్రవేశపెడతారా?

మృత్యు—నాయిష్టమేముందండి? అడ్డాలలోనుండగా బిడ్డలుగాని గడ్డాలువచ్చినతరువాత బిడ్డలా? ఇప్పుడు నామాట వించాడా లేదు. ఆయనకు ఏనవుకరీ అక్కరలేదట; అందువల్ల స్వాతంత్ర్యము లేదట; ప్లీడరీఅయితే సర్వస్వతంత్రపు జీవనమట. ఈలాటి మాటలు చెపుచూ మావాడు పట్టాపుచ్చుకొని ప్లీడరీలోనికే రావలెనంచూ వున్నాడు.

రంగ—బాగానేఉందండి. స్వతంత్రమో స్వర్గలోకమో అన్నాడు. “సేవాధర్మః పరమగహనో యోగినామప్యగమ్యః” అని సేవకావృత్తి యోగులకుకూడా పొందదగినది కాదుగదా? మీావాడికి యీపరీక్ష అయ్యేసరికి మీాకేమాత్రంసొమ్ము ఖర్చుఅయినది?

మృత్యు—ఏమిాగాకేమండి. ఈతని వివాహమునకైతేనేమి విద్యలకైతేనేమి అయిదువేల రూపాయలవరకు అయినవి. అవి వడ్డీకివేసుకొంటె నెలకు రు 50 లు వచ్చును. కాలిమీాద కాలువేసుకొని మహారాజువలె కూర్చుందును.

రంగ—ఇంతసొమ్ము ఎక్కడనుంచి పెట్టినావయ్యా!

మృత్యు—ఎలాగునా! నానలుగురుకూతుళ్ళకు నాలుగువేలు వచ్చినవి. ఒకవేయిరూపాయిలు అతని వరకట్నంబాపతు వచ్చినది. మీావంటివారిచ్చినసొమ్ము, నాఅక్షయపాత్రి పట్టుకొని కుటుంబవ్యయం జరిపేవాణ్ని.

రంగ—కూతుళ్ళవల్ల వచ్చినదంటే యేలాగున?

మృత్యు—కన్యాశుల్కము.

రంగ—మీరు మంచిపండితులు సంస్కారులుగదా! కన్యాశుల్కము పుచ్చుకోవచ్చునా?

మృత్యు—శాస్త్రములలో ముక్కలుచూస్తే కూడదుగాని జరగకపోతే చేసేపని యేమున్నది? ఇచ్చేవాళ్ళవసరముకొలది యిస్తారు. పుచ్చుకొనేవాళ్ళవసరంకొద్దీ పుచ్చుకొంటారు. ఆరహస్యము వాళ్ళలోవాళ్ళకే గాని యితరులకు తెలియదు.

రంగ—ఇచ్చేవాళ్ళకేమియవసరము?

మృత్యు—పెళ్ళాము అవసరము. రెండోపెళ్లివాళ్ళకు మూడోపెళ్ళివాళ్ళకు డబ్బుపుచ్చుకోకుండా యెవరిస్తారు?

రంగ—మీరు మీకుమార్తెలను ఏలాటివరులకిచ్చినారు.

మృత్యు—ముఖ్యముగా మూడుపెళ్ళిళ్లకు తక్కువవాళ్ళకీయనే లేదు. వాళ్ళకు ఆస్తి బాగావుంది ఆయుర్భాగ్యాలుంటె వాళ్ళనుభవిస్తారు లేకపోతే మాకేవుంచుందిగదా అని ఆలాచేసినాను.

రంగ—మీఅబ్బాయికి వేయిరూపాయలు వరకట్నమిచ్చుటకు మీకేమియాస్తియున్నది.

మృత్యు—నాకేమియున్నది నేను ఉగ్రదాన ప్రతిగ్రహణముచేసి యపరాధు చేయించడమువల్ల యీ 1½ భూమి సంపాదించినాను. అది యింకా తనఖాలలోనేయున్నది. మీయనుగ్రహమువలన ఒకకొంపమాత్రము వెయ్యిరూపాయిలు వివాహశ్రాద్ధాలవల్లవచ్చే సంపాదననుబట్టి కట్టినాను. అది శుభాశుభమిశ్రద్రవ్యమగుటచే చావకుండా బ్రతక్కుండా ఆయింట్లో బడియున్నాము.

రంగ—మీవంటి వారే డబ్బుకోసం కక్కుర్తిపడి శాస్త్రప్రకారం నడచుకోకపోతే యిక పామరులమాట చెప్పడం యెందుకు.

మృత్యు—శాస్త్రప్రకారం వెడితే నక్కపిల్లలుపుట్టుననుమాట వినలేదా. ఆలాటి కక్కుర్తిపడకుండా వరదక్షిణలక్రింద, లాంచనాలక్రింద, భోగంమేళములు, సంభావనలు, బొజ్ఞాసంచా, జరీబట్టలు వీటికోసం అధికఋణములుచేసి ఆస్తిఅంత పోగొట్టుకొనుటకు మే మేమి ప్రభువుల ముకాము గదా? ఇదిగాక కన్యాశుల్కము తప్పేల యగును. వివాహము నకు పూర్వము కన్యకు ఇంద్రుడు, చంద్రుడు, గధంర్వులు మొదలగు నలుగురుపతులుందురనియు వారినిమిత్తం కన్యావరణలిచ్చినగాని వివాహము నకు వారనుమతించరని గనబడుచున్నది. ఆలాటప్పుడు మనుష్యులమగు మేము దానిని కనిపెంచి పెద్దదానినిచేసినందుక్కు కూలికట్టవద్దా? పేదలు కన్యాశుల్కము పుచ్చుకొనుటకన్న భాగ్యవంతులు వరదక్షిణలు పుచ్చుకొనుట యెక్కువతప్పు.

రంగ—ఈకన్యాశుల్కములమాట మీస్వాములవారికి తెలిస్తే మీకు వెలివేయరా?

మృత్యు—వెలివేయడమా? వేయనీయండి దానికితగిన శుల్కము ఇస్తెవారు శుద్ధపత్రికలు వెంటనే యిస్తారు. మాకొక్క కన్యాశుల్కగ్రహణదోషమేగాని స్వాములవార్కు, రండాగర్భశుల్కము, జాతిభ్రష్టశుల్కము, చండాలసంపర్కశుల్కము, విదేశగమనశుల్కము, సముద్రయానదోషపరిహారశుల్కము, పంచమహాపాతకహారశుల్కము, సర్వప్రాయశ్చిత్తశుల్కము, యున్ని వస్తూవున్నవి. ఇవిగాక పాదపూజలు, భిక్షావందనములు, వైశాఖపూజలు వీనిమాట చెప్పనే అక్కరలేదు.

రంగ—మీపుణ్యమాయెను. సంసార్లకు, సన్యాసులకు అందరకు దోషములే యెంచుచున్నారు. పోనీయండి చివరకు మీవాణ్ని యెందులో ప్రవేశపెట్టుటకు స్థిరపరచినారు.

మృత్యు—ప్లీడరీలోనే ప్రవేశిస్తాడు గాని అందుకు ఏమి సన్నాహము కావలెనో చెప్పుదురు.

రంగ—ప్లీడరీయిప్పుడు పూర్వమువలెకాదు. ముందుగా లా రిపోర్టులు తెప్పించవలెను. అందుక్కు రు 500 లు కావలెను. అవియుంచుటకు నాలుగు అద్దాలబీరువాలుకు రు 100 కావలెను. టెక్స్టు బుక్కులుక్కు రు 400 కావలెను. కుర్చీలు, బల్లలు, వీటికితగినవహాలు, ఒకపెద్ద మేజ గుర్రపుబండి యివిఅన్నియు కావలెను. మొత్తమునకు రు 1500 లుంటేనేగాని మీవాడి ప్లీడరీ దర్జాకు తగియుండదు.

మృత్యు—(నిట్టూర్పుతో) అబ్బా! యెంతద్రవ్యము! యెంతద్రవ్యము! ఎక్కడనుంచి తేగలను. ఇదివరకు పెట్టినదాన్కి ఇదినడ్డికాబోలును. అయినసొమ్ము నాకెప్పటికి రాగలదు.

రంగ—అదృష్టం బాగాఉంటె రెండేళ్లలో దీనికి రెట్టింపు సంపాదిస్తాడు.

మృత్యు—ఇంతేనా యింకేమైనా కావలెనా?

రంగ—ఇద్దరు గుమాస్తాలు. ఒకరు మకాములోనుండుటకు, ఒకరు ఊళ్లవెంబడిపోయి వకాల్తనామాలు తీసుకొనివచ్చుటకు. వీళ్లకు చెరిపది రూపాయిలు నెలకు జీతము యివ్వవలెను. ఇవిగాక కాముకులకు దూతలవలెను వీర్కి యేజెంట్లు కావలెను, ఈవృత్తి బాగుగా సాగించి ప్లీడరీనాటకమాడించుటకు వీరే సూత్రధారులు. వీరికి వీరిపిల్లలకు, వీరి స్నేహితులుకు బంధువులుకు వచ్చినప్పుడెల్ల భోజనములుపెట్టుచూ వారు తెచ్చిన కేజులలో ఫీజులలో ఆరంభమున ప్లీడర్కు వార్కి చెరిసఖంచొ॥ యిస్తూవుండవలెను. వారిస్వంతకేసులలో ఊరికే పని చేయవలెను.

మృత్యు—పోనీయండి నాఅక్షయపాత్రవల్ల నేనుతెచ్చినబియ్యాము దాచిన మూలధనము వీటిక్రింద పెట్టెదను ఇంతటితో చాలునా?

రంగ—మీ అబ్బాయికి పి. ఆర్. అండ్ సన్సు. దగ్గరనుంచి ఒకబంగారపు గిల్టువేసిన సులోచనములు, బంగారపువాచి, ప్రశస్తమైన లాంగు కోట్లు, షర్టులు, పట్టుతలగుడ్డలు, షంల్లాము, బూట్సు, మంచి బెత్తము

గుఱ్ఱపుబండిమీాద యెక్కి తోలుటకు ఒక మాదిగవాడు ఇంట్లో పక్కలు వేయుటకు లాంపులు వెలిగించుటకు, ఒక నవుకరు ఫలహారములు తెచ్చుట కొక్క బ్రాహ్మణుడు కూడా కావలెను.

మృత్యు—ఇక్కడకు నాతలప్రాణము తోకకువచ్చినది. ఇంత డబ్బు ఉన్న కొండ్రి అమ్మివేసిఅయినా యిస్తాను గాని వాని సంపాదన కుటుంబఖర్చుమట్టుకైనా వచ్చునా?

రం—ఆరంభములో ప్లీడరుకు ఖర్చుగాని జమఉండదు. కుటుంబ ఖర్చు మీారిదివరకు యేలాగుతంటాలుపడ్డారో యింకా కొంతకాలము ఆలాగే తంటాలుపడవలెను.

మృత్యు—ఇప్పటికి నాముష్టిచెంబు మూలపడదుగదా? అయ్యో ఇప్పటి 40 సంవత్సరము లనుంచి తెల్లవారకట్టే లేచి చుట్టుపట్లగ్రామములు మధ్యాహ్నమువరకు తిరిగి యెక్కడనో భోజనముచేసి యింటికి రోజు రెండు కుంచములు బియ్యపుగింజలు తెస్తూవున్నాను. పెద్దవాణ్ని అయినాను అయినా నాకీయవస్థ తప్పదు కాబోలు

రంగ—అచ్చినచ్చిన అక్షయపాత్రి వదలకూడదు అందువలన మీావాడిసంపాదనకూడా అక్షయమే కాగలదు.

మృత్యు—పంతులుగారూ మీారు నిజమే చెప్పినారు కాని పట్టా పుచ్చుకొన్న తరువాత మావాడు నన్ను ముష్టికి వెళ్ళనిస్తాడా?

రంగ—అబ్బే! ఎందుకు వెళ్ళనిస్తాడు అది ఆయన కప్రదిష్ఠకాదా?

మృత్యు—నాకు నలభైయేళ్ళనుంచి యింట్లోతిండి అలవాటు లేనిదె యీావేళ నాకింట్లో మెతుకు లోపలకి పోచుందా? పోదు. నేను వేరేయుండి ప్రతిరోజున దొడ్డిగుమ్మమున బియ్యపుతట్టలు యింట్కి జేర వేస్తూవుంటాను. ఎవ్వరైనా యెక్కడవి అని అడిగితే మాఅబ్బాయికి పార్టీలు బియ్యము సన్నయి చేసినారు అంటాను.

రంగ—(నవ్వుచు) మాబాగాఉంది అలాగేచేయండి. అలాగైతే మిమ్ము తప్పకుండా అక్షయపాత్రకు పోనిస్తాను (అటుచూచి) ఎవరో వచ్చుచున్నారు అదుగో మనమిత్రులగు సీతారామశర్మగారిచటకే వస్తూ వున్నారు.

(అంతఆయన ప్రవేశించుచున్నాడు)

రంగ—శర్మగారూ దయచేయండి

సీతా—అయ్యా నమస్కారము. ఓహో! శాస్త్రిగారు అయ్యా నమస్కారము

రంగ—మనశాస్త్రిగారి అబ్బాయి బి. యల్. ప్యాసు అయినాడు మనకోర్టుకు ప్లీడరుగా వున్నారట

సీతా—సంతోషమే

మృత్యు—అయ్యా, శర్మగారు! మాఅబ్బాయిని సర్కారు వుద్యోగములోనికి వెళ్ళమంటారా? బారులోనికి రమ్మన్నారా చెప్పండి

సీతా—రెండు బాగానే ఉంటాయి లేనివాళ్ళకుద్యోగము! ఉన్నవాళ్ళకు బారు బాగాఉంటాయి

రంగ—ఎవళ్ళకైనా స్వతంత్రమో స్వర్గలోకమో అని స్వతంత్రమైన ప్లీడరీ సుఖముకాదా?

సీతా—అవును? నిజమే? ఈవిషయములో మీకన్న నాకు యెక్కువ అనుభవము లేదు గాని ప్లీడరీలోనున్న స్వతంత్రమేమో సెలవివ్వండి?

రంగ—అంతా స్వతంత్రమే. ఈవేళ వంట్లో సుస్తీగావుంటే కేసు యెవర్కి అయినా వప్పగించి యింటికడ నుండవచ్చును రాత్రింబగళ్ళు పనిలోపడి మునిగిపోనక్కరలేదు. ఏక్కడికైనా పోవలెనంటే ఒకరిసెలవు అక్కరలేదు.

సీతా—నాలుగుకేసులెవరికైనా వప్పగిస్తే ఈప్లీడరెప్పుడు స్వయముగా పనిచేయడని పార్టీలు మానుకొంటారు. పనిచేసే ప్లీడరు వెట్టికి చేయుచుండుటచేత శ్రద్ధగా చేయడు అందువల్ల చెడ్డపేరు వచ్చును. మకాములోనుండి వెళ్ళకపోతె ఒకబాధ మకాములోనుండకపోతె మరియొకబాధ, సర్కారు ఉద్యోగస్థుడొక్క యధికారికే లొంగియుండవలెను గాని ప్లీడరు తనవద్దకువచ్చెడి ప్రతినిరక్షరకుక్షికి యొదిగియుండవలెను. వాళ్లపేర ప్లీడరు కనిపెట్టి తిరుగవలెను. లేకపోతే నాపేరు (శీతారామా...) చెప్పకొని బ్రతుకవలెను గాని వేరొక్కగతి యుండదు.

రంగ—మీరు చెప్పినమాటలు కొంతనిజమైనను ప్లీడరీలోనున్న అవకాశము తక్కిన వృత్తులలో నున్నదా?

సీతా—ఆరంభకులకు కాదు?

మృత్యు—కనిపెట్టుకొనియుంటె లాభముంచుందా లేదా?

సీతా—అదివాళ్ళ అదృష్టము?

రంగ—శాస్త్రిగారు! మనశర్మగారెప్పుడు అకటావికటపుమాటలు చెప్పతారు మీఅబ్బాయిని నావద్ద వప్పగించండి నేను తయారు చేస్తాను.

సీతా—మీవాడు పంతులుగారంత వాడైతే మీరంతా అదృష్టవంతులే

మృత్యు—ఆయనకేమండి ఆకాశమంత మేడకట్టినాడు అరవైడబ్బైవేలు గణించినాడు

సీతా—అబద్ధములాడుటకు, అప్రమాణాలు చేయుటకు చేయించుటకు, అంతరాత్మకు వ్యతిరేకముగా నడచుటకు సందేహములేని వాళ్ళీవృత్తికిబాగా పనికివస్తారు. వారైశ్వర్యవంతులగుటకు సంశయములేదు. ఇప్పటి ప్లీడరీవ్యవహారములనుబట్టి చెప్పినాను పూర్వపువాళ్ళ మాటకాదు

రంగ—ఇప్పటివాళ్ళకన్న పూర్వులెక్కువ లా తెలిసినవాళ్ళా?